PRAMUKHANDHRA 32nd Year of Publication We carry the news and views of Telugus

32 వ సంవత్సరం

# ప్రముఖాంధ్ర



వ్యవస్థాపకులు
శ్రీ గోటేటి శ్రీరామారావు

₹.15
మార్చి 2026



THE ONE AND ONLY TELUGU MAGAZINE CIRCULATED IN USA, UK, CANADA, GERMANY, AUSTRALIA, MAURITIUS, SOUTH AFRICA, UAE, KUWAIT, SINGAPORE, MALAYSIA & ALL OVER INDIA

# GOTETI GRAPHICS

*The Complete Printing Solutions*

*Complete Service*
*from Designing to Delivery*

## *What we do....*

**BOOKS** ❖ Biography ❖ Magazines ❖ In-house magazines ❖ Souvenirs ❖ Brochures ❖ Diaries & Company profiles.

**OFFICE STATIONARY** ❖ Business Cards ❖ Letterheads ❖ Invoice ❖ Vouchers ❖ Receipts ❖ Delivery Challan Books ❖ Invitation Cards ❖ Wedding Cards ❖ Other occasion Cards ❖ Dance Arangetram Cards ❖ Hotel Menu Cards ❖ Merit Certicicates.

**BINDING OPTIONS** ❖ Hard cover ❖ Soft cover ❖ Perfect Bind ❖ Spiral bind ❖ Wiro bind & Comb Binding.

**64 (16), Thambiah Road, West Mambalam, Chennai - 600 033. INDIA**

**☎ : 044 2474 2091 / 2371 6322 ✆ : 98400 48491 E-mail : gotetigraphics@gmail.com**



# ప్రముఖాంధ్ర

ప్రపంచ తెలుగుల మానస పత్రిక

మార్చ్ 2026

సంపుటి : 32 375 సంచిక : 3




# రామ నామ స్మరణమే - అమోఘమైనది!

**"ధర్మసంస్థాపనార్థాయ సంభవామి యుగే యుగే"** అన్నది ముఖ్యంగా రామావతారానికే సరిపోతుంది. మూర్తీభవించిన ధర్మ స్వరూపుడు , మానవత్వము కల దివ్యత్వమును విశదీకరించుటకే శ్రీరాముడు అవతరించాడు. రామ తత్వమే నిజమైన మానవత్వము. రావణ తత్వమే అసురత్వం. ఎన్నెన్ని సామర్థ్యాలు శక్తులు బలగము ఆయుధములు ఉన్నప్పటికీనీ అసురతత్వం కారణంగా అవి దగ్ధమై పోవునే కానీ మానవ తత్వము నందు నిలువవు.

ధీశక్తి, యుక్తి, పాండిత్యం, పదవులతో పరమాత్ముని అనుగ్రహం పొందడం సాధ్యం కాదు. ఒక్క ప్రేమ , భక్తి చేతనే భగవంతుని అనుగ్రహం పొందవచ్చు.

శ్రీకరమౌ శ్రీ రామ నామం జీవామృత సారం.
పావనమీ రఘురామ నామం భవ తారక మంత్రం.
దధి క్షీరమ్ములకన్నా ఎంతో మధుర మధుర నామం!
సదా శివుడు ఆ రజతాచలమున సదా జపించే నామం!
కరకు బోయ తిరగేసి పలికినా కవిగా మలిచిన నామం!
మరా మరా మరా మరా!
రామ రామ రామ రామ!
రాళ్లు నీళ్ల పై తేల్చిన నామం!
రక్కసి గుండెల శూలం!
శ్రీకరమౌ శ్రీ రామ నామం జీవామృత సారం.
పావనమీ రఘురామ నామం భవ తారక మంత్రం.
వేయి జపాల కోటి తపస్సుల విలువ ఒక్క నామం!
నిండుగ దండిగ వరములొసంగే రెండక్షరముల నామం!
ఎక్కడ రాముని భజన జరుగునో అక్కడ హనుమకు స్థానం!
చల్లని నామం మ్రోగే చోట చెల్లదు మాయాజాలం!
రామ రామ రామ సీతా
రామ రామ రామ రామ
శ్రీకరమౌ శ్రీ రామ నామం జీవామృత సారం.
పావనమీ రఘురామ నామం భవ తారక మంత్రం.

మానవుణ్ణి శరీరం ,కర్మ, రాగం, ద్వేషం, అహంకారం, అధికారం,అజ్ఞానం, వ్యామోహం, అనే అష్ట శక్తులు బంధించి వేధిస్తున్నాయి. విద్యావంతులు సహితము జన కాలుష్యంలో చిక్కి అజ్ఞానులవుతున్నారు. భగవాన్ శ్రీ సత్యసాయి చెప్పినట్లు - ఈ అజ్ఞానం అనేది అవివేకం నుండి పుడుతూన్నది, అవివేకం అహంకారం నుండి పుడుతుంది. అహంకారం ద్వేషం నుంచి పుడుతున్నది. ద్వేషం రాగం నుండి పుడుతున్నది. రాగం కర్మ నుండి పుడుతున్నది. కర్మ శరీరం నుండి పుడుతున్నది. శరీరం పుట్టినప్పటి నుండి ఇవన్నీ గొలుసు కట్టులా ఒకదానికొకటి జత కలుపుతూనే వున్నాయి. ఇవన్నీ అజ్ఞానమనే చీకట్లోనే చరిస్తున్నాయి. చిరు దీపాన్ని వెలిగిస్తే కానీ ఆ చీకటి తొలగదు. అజ్ఞానం పోదు . ఆ చిరు దీపమే ' రామ' అనే రెండక్షర నామం. గోరంత దీపం కొండలకు వెలుగైనట్టు , రామ అనే రెండక్షరాలు గృహానికంతా వెలుగునిస్తాయి. ఇలా ఒక్కొక్క గృహము వెలుగు నింపుకుంటూ పోతే ప్రపంచమే వెల్తురుతో నిండి పోతుంది. వీటికి తోడు దానము , ధ్యానము తోడవుతే జీవితం అమోఘమవుతుంది. ఈ చిరు దీపాన్ని వెలిగించే రామ నామ ప్రభావం అమోఘమైనది. రామ నామాన్నే స్మరిద్దాం, తరిద్దాం. జై శ్రీరామ్.



**- బుధ జన విధేయుడు**
గోటేటి శ్రీ రామారావు
ఏప్రిల్ 2005


Founder Editor : **GOTETI SRI RAMA RAO**, Editor : **GOTETI VENKATESWARA RAO**
Printed, Published & Owned by **G.V.RAO**, Associate Editor
at **GOTETI GRAPHICS**, 16 (64), Thambiah Reddy Road, West Mambalam, Chennai - 33.
Phone : 91-44-24742091, 91-44-23716322, 91-44-24894145 - Tele Fax : 91-44-23716322
**www.pramukhandhra.org/E.mail : pramukhandhra95@gmail.com**
**YEARLY SUBSCRIPTION : RS. 216/- PROMOTERS SUBSCRIPTION : RS. 2116/-**

"శ్రీరామ రామ రామేతి రమే రామే మనోరమే
సహస్ర నామ తత్తుల్యం రామనామ వరాననే!"

# మూడుసార్లు స్మరిస్తే సహస్రం ఎలా?



ఈ శ్లోకాన్ని మూడుసార్లు పఠిస్తే సహస్ర నామం పఠించిన దానికి సమానమని భావం.

ఈ విషయాన్ని సాక్షాత్తూ పరమ శివుడు పార్వతీదేవికి చెబుతాడు. అంతటి పరమ పవిత్రమైన, ఉత్కృష్టమైన శ్లోకం ఇది. శక్తిని భక్తిని కలిమిని బలిమిని చెలిమిని ఆరోగ్యాన్ని సకల సౌభాగ్యాలను అందించే శ్లోకం. రామనామం యొక్క విశిష్టతను, తెలియజేసే శ్లోకం.

నారదుని ఉపదేశానుసారంగా, రామనామాన్ని జపించిన రత్నాకరుడు వాల్మీకి మహర్షిగా అవతరించారు. రామాయణ మహా కావ్యాన్ని మానవాళికి అందించారు.

చిరస్మరణీయుడయ్యారు.

నిజానికి ఇంతటి మహోన్నత శక్తి ఈ శ్లోకానికి రావడానికి, 'రామ' అనే నామానికి ఉన్న ప్రాభవమూ వైభవమే కారణం. మూడుసార్లు పై శ్లోకాన్ని పఠిస్తే వచ్చే ఫలితం, వేయి సార్లు పఠనం చేస్తే వచ్చే ఫలితానికి సమానమై న ఫలితాన్ని యిస్తుందని చెప్పినది సాక్షాత్తూ పరమ శివుడు. కాబట్టి అది పరమ సత్యం.

అంతేకాకుండా 'రామ' అనే శబ్దాన్ని మూడు సార్లు స్మరణ చేస్తే ఏమవుతుంది? ఏ రకమైన ఫలితం వస్తుంది? అనే ప్రశ్నకు సమాధానాన్ని మహనీయులు, మహానుభావులు, గురువులు మహా వైభవోపేతంగా చెప్పిన దృష్టాంతాలు ఎన్నో ఉన్నాయి.

అయితే యిది ఆధునిక యుగం. కంప్యూటర్ యుగం. క్షిపణుల యుగం. వైజ్ఞానికంగా ఎంతో అభివృద్ధిని సాధించిన దశలో మనుగడ సాగిస్తున్నాం. కాబట్టి ఏదైనా సహతుకంగా, ఆధునికంగా ఆలోచన చేస్తేనే, చెప్పింది జనామోదం పొందుతుంది. చెప్పిన దానికి ఓ ఋజువునో, శాస్త్రీయతనో, సహతుకతనో చూప లేకపోతే, ఎంత గొప్ప విషయమైనా మూర్ఖత్వమని తీసిపారేసే పరిస్థితులలో బ్రతుకుతున్నాం.

నిజానికి మూడుసార్లు పఠనం చేస్తే, వేయిసార్లు పఠించిన ఫలితం ఎలా వస్తుంది? మూడు అనే ది వేయి ఎలా అవుతుంది? అనే అనుమానం కలగడం సహజమే.

అందుకనే మనం కాలాను గుణంగా ఆలోచనలు చేయాలి. మన సమర్ధింపు విశ్లేషణ ఆధునిక సమాజమూఆమోదించేలా ఉం డాలి.

కాబట్టి కాలానికి అనుగుణం గా, ఓ విభిన్న పద్ధతిలో, ఆధ్యాత్మికానికి కొంచెం సహతుకతను, శాస్త్రీయతను జోడించి, మూడు సార్లు పై శ్లోకాన్ని పఠిస్తే, వేయి సార్లుకి సరిసమము ఎలా అవుతుందో పరిశీలిద్దాం.

మనం చెప్పుకునే పరిశీలన ఓ శాస్త్ర విజ్ఞాన సాధికారకత ప్రకా రం ఉందని కాదు. పూర్తి వైజ్ఞానిక సాధికారకత గల విశ్లేషణ అని చెప్పటమూ కాదు. అమూల్యమైన ఆధ్యాత్మిక తత్వాన్ని, సనాతన ఆర్ష సంస్కృతీ వైశిష్ట్యాన్ని, ఓ చిన్న ప్రామాణికంతో, ఓ నిర్దేశిత పద్ధతిలో, ఓ సాక్ష్యంగా చెప్పుకునే సమర్ధింపు మాత్రమే.

లోతులకు వెళ్లి అవలోకనం చేస్తే, ఓ కోణంలో దొరకిన సమర్ధింపుతో కూడిన సూత్రీకరణ మాత్రమే ఇది.

అదేంటో యిప్పుడు చూద్దాం. రామ అనే పదంలో 'ర', 'మ' అనే రెండక్షరాలు ఉన్నాయి. అక్షరాలు అనగానే వర్ణమాల గుర్తొస్తుంది. తెలుగు వర్ణమాల, 'అ' అనే అక్షరంతో మొదలై ,'అం' 'అహ' వరకు తిన్నగా ఒక వరుసన రాస్తాం. తర్వాత హల్లుల దగ్గరకు వచ్చేసరికి, 'క ఖ గ ఘ ఙ' ఒక వరుసలో, 'చ ఛ జ ఝ' లను ఒక వరుసలో.... యిలా 'ప ఫ బ భ మ' వరకు అయిదేసి అక్షరాలను ఒక వరుసగా రాస్తాం. 'య' నుంచి బండి ర వరకు వరుసగా రాస్తాం. ఇదీ...తెలుగు వర్ణమాల ప్రత్యేకత!

వర్ణమాల ఆధారంగా మూడుసార్లు రామ నామాన్ని ఉచ్చారణ చేస్తే 'వేయి' ఎలా అవుతుందో చూద్దాం. వర్ణమాల ఆధారంగా 'రామ' శబ్దం యొక్క ఫలా న్ని/బలాన్ని లెక్కిద్దాం. ఆ లెక్కను ఆధారం చేసుకుని 'మూడు' సార్లు "రామ" అంటే వచ్చే ఫలితాన్ని రాబడదాం.

"ర" అనే అక్షరం వర్ణమాలలో ఆఖరి వరుసలో రెండోదిగా ఉంటుంది. అంటే 'ర' అక్షర ఫలం రెండు. అలాగే 'మ' అక్షరం అంతకుముందు వరుసలో అయిదోది. అంటే "మ" అక్షర ఫలం అయిదు.

కాబట్టి "రామ" శబ్దాన్ని ఒక్కసారి ఉచ్చరిస్తే వచ్చే ఫలం 2 X 5 = 10 అవుతుంది. రెండుసార్లు ఉచ్చరించగానే 10 X 10 = 100 అవుతుంది. అదేవిధంగా మూడుసార్లు ఉచ్చరిస్తే 10 X 10 X 10 = 1000 అవుతుంది. అంటే సహస్రం అవుతుంది. ఇదీ 'రామ' శబ్దాన్ని మూడుసార్లు ఉచ్చరిస్తే, వేయి ఫలితం వస్తుందనేందుకు ఆధునిక నిదర్శనం.

ఇది ఆధ్యాత్మిక తత్వానికి సహతుకతను జోడించే చిన్న ప్రయత్నం మాత్రమే. ఆధునిక జగత్తులో సమయాభావం వలన పై శ్లోకాన్ని కనీసం మూడుసార్లు ఉచ్చరిస్తే, సహస్ర నామ స్మరణ ఫలితం వస్తుందని చెప్పటమే వ్యాసం ఉద్దేశ్యం ❑

భగవంతునికి భక్తునికి
అనుసంధానమైనది
AMBICA DURBAR BATHI
అంబికా దర్బార్ బత్తి



# శ్రీరాముడే 'భారతీయత'

**భా**రతీయ సంస్కృతులపై రామకృష్ణుల ప్రభావం ప్రగాఢమైనది. ఆసేతు శీతాచలం శ్రీరామనామం భారతీయుల గుండె చప్పుడు. ఏభాషవారైనా, ఏ రాష్ట్రంవారైనా, ఏ సంప్రదాయ పద్ధతుల వారైనా రామకృష్ణుల విషయంలో ఏకమైపోతారు.

'రామ రామ' 'జైశ్రీరాం', 'శ్రీరామ'... ఇలా పలురకాలుగా రామ నామ ధ్వని మన నాడీనాదంగా మిగిలిపోయింది.

రామనామం, రామకథ మన జీవనధార.

వాల్మీకి రచించిన 'శ్రీమద్రామాయణం' అటుపై సంస్కృత సాహిత్య జగతిలోనే అనేక మహాకవులచేత నాటక కావ్యాలుగా, ఆర్షరామాయణాలుగా వ్యాప్తి చెందింది. వ్యాసదేవుడు ప్రతి పురాణంలోనూ రామకథను రచించడమే కాక, 'మహాభారతం- అరణ్యపర్వం'లో మార్కండేయుడు ధర్మరాజుకు 'రామాయణ' గాథను వివరించినట్లుగా విరచించాడు. శ్రీమద్భాగవతంలో నవమస్కంధంలో శ్రీరామావతార గాథ బహురమ్యంగా భాసిల్లింది.

విశ్వామిత్ర కృతంగా భావించబడే 'శ్రీమదధ్యాత్మ రామాయణం' రామాయణంలోని వేదాంతకోణాన్ని విశ్లేషించింది. అగస్త్య రామాయణం, భరద్వాజ రామాయణం, ఆనంద రామాయణం వంటి ఆర్ష సంస్కృత కావ్య రామాయణాలు అసంఖ్యాకాలు. కాళిదాసు, భోజుడు, దిఙ్నాగుడు, మురారి, భవభూతి వంటి విశిష్ట సాహితీ మూర్తులు సంస్కృతంలో రామకథను రమ్యంగా అక్షరీకరించారు. దేశభాషలోని రామకథా ప్రపంచాన్ని అటు ఉంచి దేశభాషలలో ప్రతిభాషలోనూ అధికసంఖ్యలో రామాయణాలు పుట్టాయి. కేవలం అనువాద గ్రంథాలుగా కాకుండా తమ భావనా శక్తినీ, ఆలోచనా విధానాన్నీ , అందమైన కల్పనలనీ , అపురూపమైన భక్తిగాఢతనీ మేళవించి 'తమ' రామాయణాలుగా తీర్చిదిద్దుకున్నారు. హిందీలో 'తులసీ రామాయణం' (రామచరిత మానస్) బహు ప్రసిద్ధిని చెందినది. తెలుగులో మొల్ల రామాయణం, భాస్కర రామాయణం, రంగనాథ రామాయణం వంటివి ప్రసిద్ధి చెందినవిగా ఉండగా, కవిసామ్రాట్ విశ్వనాథ సత్యనారాయణగారు "కవితా రూప తపస్సు" చేసి "సర్వ కవితా సంభారం"గా 'శ్రీమద్రామాయణ కల్పవృక్షాన్ని' ఆంధ్ర సాహితీ నందనంలో పాదుకొల్పారు.

ఎడనెడా కల్పవృక్షాన్ని విషవృక్షంగా భావించే ఆసురీ రామాయణాలు కొన్ని పుట్టినా నాస్తికుల మనో వినోదానికి పనికివచ్చాయే తప్ప, అసంఖ్యాక భారత ప్రజల హృదయంలోని రామ భావనని చెక్కు చెదిరించలేకపోయాయి.

జానపదుల పాటల్లో, వీధినాటకాల్లో, హరికథల్లో, బుఱ్ఱకథల్లో రామకథల్లోని పలు ఘట్టాలు శాశ్వతత్వాన్ని పొందాయి. భగవంతుడు మానవజీవితాలలో కలిసిపోయి, మానవత్వాన్ని దివ్యత్వస్థాయికి తీర్చిదిద్దడానికై రామకృష్ణావతారాలుగా సాక్షాత్కరించాడు.

రాముడు మానవుడా? దేవుడా? అనే చర్చ సాగుతూనే ఉంటుంది. దానికి వాల్మీకి హృదయం ప్రకారం ఒకటే సమాధానం. పరిపూర్ణ మానవుడు ఎలా ఉండాలో తెలియజేయడానికి, మానవుడై అవతరించిన మాధవుడే రాముడు. ఆదర్శ, ఆరాధ్య ధర్మాల కలబోత . రామునితో పాటు రామాయణ పాత్రలు భారతీయ జీవన స్రవంతిలో నిరంతర తరంగాలై పోయాయి.

'రాములోరు' 'సీతమ్మ ' 'లక్ష్మణస్వామి' 'హనుమన్న'... ఇలా అతి సామాన్యులు సైతం రాముని ఆత్మీయం చేసుకున్నారు. మహిమాన్విత మంత్రమూర్తులుగా శ్రీసీతారాములు, హనుమంతుడు భాసిస్తారు.

రామునిలో, రామాయణంలో ఆదర్శమైన మానవ ధర్మాలున్నాయి. ఆరాధ్యమైన దైవత్వం ఉంది. ఆ రెండింటిని అద్భుతంగా మేళవించిన వాల్మీకికి వందనాలు. రామాయణంలోని కుటుంబ వ్యవస్థ, పాలనా వ్యవస్థ,

ఒక పరిపక్వ నాగరిక సమాజం యొక్క ఆవిష్కరణ సర్వమానవ సమాజానికి ఆదర్శాలు. చరిత్రల పరిమితులకు అందని సుచరిత్ర కలిగిన 'సత్యం' రాముడు.

"Burn all the Libraries , Let there be Ramayana" అని ఒక పాశ్చాత్యుడు, రామాయణం చదివిన రసావేశంలో పలవరించాడు. ప్రాణం లేని మనిషినీ, రాముడులేని భారతదేశాన్ని మనం ఊహించలేము. హిమాచలం నుండి సేతువు వరకు రామనామం, రామగాథ, గంగా, గోదావరిగా, కావేరిగా ఉరుకులతో పరుగులతో సాగివచ్చి, సముద్రమై అపార విస్తారాన్ని పొందింది. రామచరిత్ర అనంత సాహిత్యంగా మిగిలింది. యుగాల క్రితమే ఒక పరిపూర్ణ దివ్య మానవుడిగా, ధర్మబద్ధమానవ సమాజాన్ని సుస్థిరం చేసిన రామకథ విశ్వసాహితిలో ఒక అద్భుతం. ప్రతాపానికీ, ప్రసన్నతకీ, వీరత్వానికీ, వినయానికీ, ధర్మం పట్ల ఆదరణకీ, అధర్మం పట్ల ఆగ్రహానికీ, సామర్థ్యానికీ, సంయమనానికి నిలువెత్తు తార్కాణం రాముడు.

అద్భుతమైన వాక్ శిల్పం, సునిశితమైన రాజనీతి, సుస్థిరమైన సచ్ఛీలత, సత్యనిష్ఠ, అందరినీ అక్కున చేర్చుకునే అపారప్రేమ శ్రీరాముని వ్యక్తిత్వ కాంతిరేఖలు. గుహుడు, శబరి, వానరులు ఇలా ఎందరో సామాన్యులు, బడుగు వర్గాల మహానుభావులు శ్రీరామదాసులు. ఊరూరా వాడవాడలా రామమందిరాలు, సీతారాముల పెళ్ళిపందిళ్ళు, పట్టాభిరాముని కొలువులు ఈ దేశమంతటా పరచుకున్న రామసంస్కృతి. రాముని ఉనికిని శంకించేవారి, కించపరచేవారి ఉనికినే సందేహాస్పదం చేయగలవారు భారతీయులు. రామనామం మనకి మంత్రం, రామరూపం మనకి పూజ్యమూర్తి. రామకథ మనకి నిత్య పారాయణం. 'రామ' అంటే రమణీయమైనవాడు. రూపం, నామం, గుణసమూహం, చరిత్ర, మహిమ, తత్త్వం అన్నీ రమణీయాలే. ఈ రమణీయాల సమాహార స్వరూపుడైన 'సకల గుణాభిరాము'ని నిత్యం తలచే వారి మనసు రమణీయం- మనుగడా రమణీయం . ❑

సమన్వయ సరస్వతి, వాగ్దేవి వరపుత్ర, ప్రవచన విరించి, శివతత్త్వసుధానిధి, ధార్మిక తపస్వి, ధార్మిక వరేణ్య పూజ్య గురువుగారు - **"బ్రహ్మశ్రీ సామవేదం షణ్ముఖ శర్మ గారు" రచించిన వ్యాసం.**



భర్జనం భవబీజానా
మర్జనంసుఖసంపదామ్శ్రీ
తర్జనం యమదూతానాశ్రీ రామ
రామేతి గర్జనమ్ ॥

**శ్రీ రామరక్షా స్తోత్రం**

రామనామ జపం వలన సంసార కారణాలు నశించిపోతాయి. సుఖసంపదలు చేకూరుతాయి. రామ నామ మంత్ర ప్రభావంచేత యమభటులు సైతం భయపడతారు. రామనామ జపం అన్ని సంసార బంధనాలను తొలగించి, సమస్త సుఖ సంపత్తులను ప్రసాదించి, యమదూతలను కూడా భయపెట్టగల శక్తివంతమైనది. "రామా! రామా!" అను గర్జనము మానవుని జన్మలకు కారణమగు బీజములను నశింపజేయును. సకల సుఖములను, సంపదలను పెంపొంద జేయును. యమదూతలను దగ్గరకు రాకుండా బెదరగొట్టును.

# ప్రముఖాంధ్ర అభిమానులకు ఆహ్వానం, అభ్యర్థన!

ప్రముఖాంధ్ర గత **31** సంవత్సరాలుగా నిరాటంకంగా వస్తూనే వుంది. ఎందరో అభిమానులు ఏ పరిమాణంలో సహాయం అందించాలని ఫోన్లు చేస్తున్నారు? 'వేలు'గా ఇవ్వ అవకాశం లేని అభిమానులున్నామంటున్నారు.

అలాటి మహోదయులకు, మహా హృదయులకూ పరిమితి లేదు, పరిధి లేదు. మీ శక్తికి తగినట్లు, మీ మనసుకు తోచినట్లు సహాయ సహకారము లందచేయండి! ప్రతా ఒక్క నీటిబొట్టూ కూడితేనే ప్రవాహమవుతుందీ, జీవనదీ అవుతూంది. చేరిన ప్రతీ నీటిబొట్టునూ దాచుకొని సాగరం తిరిగి మేఘమై, మేఘం వర్షమై చినుకు చినుకుగా భువినెలా సస్యశ్యామల కోమలం చేస్తూ పంటలను పండిస్తూందో - మేమూ అలానే మీ ప్రతీ 'రూక'నూ ప్రముఖాంధ్రుల భాషా సేవకే వినియోగిస్తాం. 'ప్రముఖాంధ్ర'ను పంట పొలంగా చేసి, తెలుగు అక్షర విత్తులను పండిస్తాం. ఇదే మా వినతి! ఇదే మా అభ్యర్థన. ఇదే మా హృదయపూర్వక ఆహ్వానం. పోస్టు ద్వారా ఉత్తరాలు వ్రాసి ఉన్న డబ్బులను కూడా హరింపచేయలేం. గ్రహించండి.

**రూ. 1001, 2001, 5001, 10,001, 25,001, 50,001 మీ ఇష్టం ఎంతైనా**

ప్రముఖాంధ్ర బ్యాంక్ వివరాలు :

| | | |
|---|---|---|
| Account Name | : | **PRAMUKHANDHRA** |
| Account No | : | **20011102592** |
| Bank | : | **BANK OF MAHARASTRA, T.NAGAR** |
| IFSC Code | : | **MAHB 0000450** |

**ప్రముఖాంధ్ర**
**64, తంబయ్యరెడ్డి వీధి, వెస్టుమాంబళం, చెన్నై - 33.**
**మొబైల్ : 98400 48941**

# తెలుగువారికే ప్రత్యేకమైన సురభి నాటకం



ఆంధ్ర ప్రదేశ్‌లో తోలుబోమ్మలాట 3వ శతాబ్దం నుంచి వుంది అని భావింపబడుతోంది. 1885లో కడప జిల్లా జమ్మలమడుగు సమీపంలో సొరుగ్నc అనే గ్రామంలో ఒక సంపన్నుల ఇంటిలో జరిగిన పెళ్ళిలో వనారస గోవిందరావు, "కీచక వధ" ని తోలుబోమ్మలాటలోని బొమ్మలకి బదులు తన కుటుంబ సభ్యులచేత ప్రయోగాత్మకంగా నాటకరీతిలో ప్రదర్శించి ప్రేక్షకుల మన్నన పొందారు. ఈ విజయంతో వారి తోలుబొమ్మలాట కుటుంబం శాస్త్రీయ నాటక ప్రదర్శన కుటుంబంగా మారింది. సొరుగ్నc గ్రామం కాలక్రమేణా "సురభి" అనే పేరుతో ప్రాచుర్యం పొందింది. వనారస గోవిందరావు నాటకాలు సురభి గ్రామం చుట్టూ చాలా పేరొందడంతో మరియు ఆ నాటకాల్లో నటించిన పెక్కు కళాకారులు ఆ ప్రాంతంలోనే నివసించడంతో, వనారస గోవిందరావు యొక్క నాటక సభ్యులు సురభి నాటక సంఘం అనే పేరుతో ప్రాచుర్యం పొందారు. ఈ సురభి కళాకారుల మూలాలు మరాఠా నాయకుడు ఛత్రపతి శివాజీ యుద్ధసేనలో భాగమైన ఒక సైనిక వర్గానివి. వారు తరువాత కాలం లో ఆంధ్ర ప్రదేశ్ లోని రాయలసీమ ప్రాంతానికి వలస వచ్చారని చరిత్రకారులు భావిస్తున్నారు.

11వ శతాబ్దపు తెలుగు కవి, ఆదికవి నన్నయ, మహాభారతానికి తన పరిచయ వాక్యాల్లో తన జీవితంలో ఎన్నో నాటకాలను (కావ్య నాటకాలు) చూసానని తెలిపాడు. తెలుగు కవి వినుకొండ వల్లభరాయలు 15వ శతాబ్దంలో "క్రీడాభిరామమం" " అనే వీధి నాటకాన్ని రాశారు. కొందరు పండితులు దీనిని తెలుగు కవి శ్రీనాధుడు (1335--1441) రాసినట్లు అభిప్రాయపడ్డారు. 16వ శతాబ్దంలో కూచిపూడి భాగవతార్లు వీధి నాటకాలను చిందు భాగవతం, యక్షగానం మరియు వీధి భాగవతం రూపంలో ప్రదర్శించి ప్రాచుర్యం కలిగించారు. ఆధునిక తెలుగు నాటకానికి పితామహుడిగా " మంజరీ మధుకరీయం " రాసిన కోరాడ రామచంద్ర శాస్త్రి (1860) ని పేర్కొంటారు. (వీరి మనమడు కోరాడ రామచంద్ర శాస్త్రి గారు మాకు రామకృష్ణా మిషన్ హై స్కూల్, టీ నగర్, మద్రాసు లో సైన్సు మాస్టారు). తెలుగు నాటకాల్లో పద్యాలు పాడటం (పద్య నాటకం) యొక్క ప్రాచుర్యం తిరుపతి వేంకట కవుల కాలంలో మరింత ఊపు అందుకుంది. చెళ్లపిళ్ల వెంకట శాస్త్రి (1870--1950) మరియు దివాకర్ల తిరుపతి శాస్త్రి (1872--1919) వీరిద్దరు తిరుపతి వెంకట కవులు గా ప్రసిద్ధులు. వారు హైందవ ఇతిహాసాలను పద్యరూపంలో మార్చగా వాటిని కళాకారులు నాటకాలుగా ప్రదర్శించారు. ఈ పద్యానాటకాలు ప్రేక్షకులను అప్పట్లో విపరీతంగా ఆకట్టుకున్నాయి. 'సత్య హరిశ్చంద్ర', 'కురుక్షేత్రం' "గయోపాఖ్యానం "వంటి కొన్ని నాటకాల ప్రదర్శనలో కళాకారులు పద్యాలను పాడుతూ ప్రదర్శించేవారు, వీటి వల్ల ప్రేక్షకులలో ఈ నాటకాలకి విశేష ఆకర్షణ ఏర్పడింది.

**సురభి నాటకం : మార్పులు, రూపాంతరం**

వనారస గోవిందరావు కు ముగ్గురు కొడుకులు, పది కుమార్తెలు ఉండగా, పెద్ద కుమారుడు మినహాయించి మొత్తం కుటుంబం తమ జీవితాంతం నాటకరంగం లోనే గడిపారు. గోవిందరావు గారి అయిదవ కుమార్తె శ్రీమతి సుభద్రమ్మ మరియు ఆమె భర్త శ్రీ ఆర్. వెంకటరావు, 1937లో శ్రీ వెంకటేశ్వర నాట్య మండలి (సురభి) ని శ్రీకాకుళం జిల్లాలో ప్రారంభించారు. శ్రీమతి సుభద్రమ్మ ముఖ్యంగా ధుర్యోధన వంటి పాత్రలు వేయడంలో నైపుణ్యం సంపాదించారు. శ్రీమతి సుభద్రమ్మ గారిని ఆంధ్ర ప్రదేశ్ సంగీత నాటక అకాడెమీ వారు " కళా ప్రపూర్ణ " బిరుదుతో సత్కరించారు. వారి కుమారుడు ఆర్. నాగేశ్వరరావు (సురభి బాబ్జీగా పేరుగాంచిన) ఆ సాంప్రదాయాన్ని కొనసాగించి సురభి థియేటర్ ని మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్లి 2013లో పద్మశ్రీ బహుమతిని కూడా అందుకున్నారు.

పద్మశ్రీ బి.వి.కరంత్ గారి దర్శకత్వంలో సురభి థియేటర్స్ మూడు ప్రముఖ నాటకాలను నేర్చుకోవడం జరిగింది: భీష్మ (1996), నేషనల్



స్కూల్ ఆఫ్ డ్రామా (న్యూఢిల్లీ) నిర్వహించిన ప్రదర్శన; చండీ ప్రియ (1997), అలరిప్పు (న్యూఢిల్లీ) ద్వారా నిర్వహించిన ప్రదర్శన ; బస్తీ దేవత యాదమ్మ (1998), బర్టోల్ట్ బ్రెక్ట్ రచించిన "ది గుడ్ వుమెన్ ఆఫ్ సెజువాన్" ఆధారంగా. బి.వి. కరంత్ గారు ఈ మూడు నాటకాలకు దర్శకత్వం తోపాటు సంగీతాన్ని కూడా అందించారు.

సురభి బాబ్జీ శ్రీ వెంకటేశ్వర నాట్య మండలి కి 42 ఏళ్ల పాటు నేతృత్వం వహించారు దానితోపాటు సురభి నాట్య కళా సంఘం అనే ఐదు సురభి సంఘాల సమష్టి కూటమికి 24 ఏళ్ల పాటు కార్యదర్శి గా సేవలందించారు. ఆయన శ్రీరామ రాజ్యం, శ్రీకృష్ణలీలలు, బాలనాగమ్మ, లవకుశ, మాయాబజార్, బొబ్బిలి యుద్ధం, చింతామణి, రంగూన్ రౌడి, వీరబ్రహ్మం గారి చరిత్ర వంటి పలు సురభి నాటకాలకి దర్శకత్వం వహించారు. బాబ్జీ గారి నేత్రత్వం లో సురభి కళాకారులు దేశ వ్యాప్తంగానే కాకుండా ఫ్రాన్స్ లో కూడా రెండు నెలలపాటు నాటక ప్రదర్శనలు చేసారు. బాబ్జీ 2022 జూన్ 9 న కన్ను మూశారు. సురభి నాటకాన్ని మరింత తీర్చిదిద్దటానికి బాబ్జీ గారు గరిమెళ్ళ రామ మూర్తి గారి మార్గదర్శకం, మద్దతుతో అనేక దశాబ్దాలు కృషి చేసారు. పద్మశ్రీ బి.వి. కరంత్ గారి మార్గదర్శకం కూడా సురభి నాటకాన్ని ఆధునిక కాలానికి అనుగుణంగా తీర్చిదిద్దడంలో కీలకపాత్ర పోషించింది.

ప్రస్తుతం పద్మశ్రీ సురభి బాబ్జీ గారి మనవడు జయచంద్ర వర్మ, శ్రీ వెంకటేశ్వర సురభి థియేటర్ కి డైరెక్టర్ మరియు కార్యదర్శి గా ఉన్నారు. ఆయన ఆధునిక కాలంలో, డిజిటల్ ప్రపంచంలో కూడా సురభి నాటకం యొక్క ప్రాముఖ్యతని కొనసాగింపజేయడానికి కృషి చేస్తున్నారు. 2013లో ఫ్రాన్స్ పాసేజ్ ఇంటర్?నేషనల్ థియేటర్ ఫెస్టివల్లో ఆయన అనేక సురభి నాటకాల్లో ప్రధాన పాత్రలు ధరించారు. జయచంద్ర వర్మ సురభి నాటక ప్రోత్సాహానికి చేసిన కృషికిగాను ఆయనకు ఉస్తాద్ బిస్మిల్లా ఖాన్ యువ పురస్కారం (సంగీత నాటక అకాడమీ, న్యూఢిల్లీ) మరియు జెఎల్ నరసింహ రావు రంగస్థల యువ పురస్కారం 2017 (పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం) వంటి పలు సత్కారాలు లభించాయి.

**సురభి నాటక లక్షణాలు**

సురభి నాటకం పద్య నాటకం (సాంప్రదాయ తెలుగు ఛందస్సు నాటకం) ప్రదర్శనలకు ప్రసిద్ధి చెందింది. రంగురంగుల మాయాజాల నేపథ్యాలు, ఆకర్షణీయమైన సన్నివేశాలు మరియు అద్భుతమైన ట్రిక్ సీన్లతో ఈ నాటకాలు ప్రేక్షకులని అలరిస్తాయి. సురభి నాటకాలలోని స్పెషల్ ఎఫెక్ట్స్ చూడాల్సిందే గానీ మాటల్లో చెబితే నమ్మలేం. సురభి పౌరాణిక నాటకాలలో నారదుడు ఆకాశమార్గంలో ప్రయాణిస్తాడు! ఘటోత్కచుడు వేదికపై నిప్పు రగిలిస్తాడు, శ్రీకృష్ణుడు కాళీయ నాగుపై నృత్యం చేస్తాడు.

సురభి నాటకంలోని ప్రత్యేక విశేషం ఏమిటంటే, ఈ బృందానికి చెందిన కళాకారులు మరియు సాంకేతిక నిపుణులు అందరూ ఒకే కుటుంబానికి చెందినవారు. వారు తమ జీవితాలను రంగస్థలానికి అంకితం చేశారు. ప్రతి కళాకారుడు నాటకానికి సంబంధించిన అన్ని అంశాల్లో తానుఎల్లప్పుడూ సంసిద్ధంగా వుండేలా సంపూర్ణ నైపుణ్యం కలిగి ఉంటాడు.

సురభి సభ్యులు ఒక అరుదైన కుటుంబ సమూహ సంస్థగా ఉంటూ వుండి ప్రారంభకాలంలో గ్రామాల్లో నాటకాలు ప్రదర్శిస్తూ మజిలీలతో జీవించేవారు. సురభి నాటకాలు ప్రధానంగా భారతదేశ సంస్కృతి లో అంతర్లీన ఇతిహాసాలు అయిన రామాయణం, మహాభారతం, భాగవతం పై ఆధారపడి ఉంటాయి. ఒకానొక కాలంలో ఆంధ్రప్రదేశ్ మరియు తెలంగాణ రాష్ట్రాలలో సుమారు 60 కంటే ఎక్కువ సురభి బృందాలు , దాదాపు 3,000 కళాకారులతో ప్రదర్శనలు చేస్తుండేవి.

**జననం నుంచి మరణం వరకు**

సురభి కుటుంబానికి చెందిన కళాకారులకు వయోపరిమితి లేదా వృత్తి విరమణ అనే భావన లేదు. సురభి నాటక ప్రదర్శనలో గర్భవతిగా ఉన్న తల్లులు వేదికపై నటిస్తున్న సమయంలోనే వారికి పిల్లలు జన్మించిన సంఘటనలు ఉన్నాయి. అలాగే, కొంతమంది కళాకారులు తమ పాత్రలను పోషిస్తూ చివరి శ్వాస విడిచిన సందర్భాలు కూడా ఉన్నాయి.

ఐదు దశాబ్దాల క్రితం వరకు సురభి నాటకాలు అర్ధరాత్రి ప్రారంభమై తెల్లవారుజాము వరకు కొనసాగేవి. ఆ సుదీర్ఘ నాటకాలలో ప్రధాన పాత్రలను ఇద్దరు కళాకారులు ఒకరి తరవాత మరొకరు (ఉదాహరణ కి మాయాబజార్ నాటకం లో ఒకటో కృష్ణుడు, రెండో కృష్ణుడు) పోషించేవారు --- ఇది సురభి నాటకాలకు మాత్రమే వున్న ఒక అరుదైన ప్రత్యేకత. ఆర్థికంగా నిలదొక్కుకోలేని పరిస్థితుల కారణంగా అనేక సురభి నాటక బృందాలు తమ కార్యకలాపాలను ఆపివేయాల్సి వచ్చింది.

సురభి నాటకాలలో మహిళలు మరియు పిల్లలు ఎప్పటినుంచో అంతర్భాగంగా ఉంటున్నారు. పూర్వకాలంలో తెలుగు నాటకాలలో స్త్రీ పాత్రలను పురుషులే పోషించేవారు. సురభి ఈ సంప్రదాయాన్ని మార్చి, తమ నాటకాలలో స్త్రీ పాత్రలను మహిళలే పోషించే విధానాన్ని ప్రవేశపెట్టింది. అంతే కాకుండా సురభి నాటకాలలో కొంతమంది మహిళా కళాకారులు పురుష పాత్రలను కూడా పోషించేవారు!

**నాటకానికి సినిమాకు మధ్య వారధి:**

సురభి గ్రామోఫోన్ రికార్డులను ప్రజాదరణ పొందేలా చేసింది, అనేక మంది నటులను సినిమా పరిశ్రమకు అందించింది, అలాగే తెలుగు రాష్ట్రాల భౌగోళిక సరిహద్దులను దాటి నాటకాన్ని విస్తరింపజేసింది. సురభి నాటక బృందానికి చెందిన సురభి కమలాబాయి (1907--1971) 'భక్త ప్రహ్లాద' (1932) అనే తొలి తెలుగు టాకీ సినిమాలో నటించిన తొలి

రుచికి, సువాసనకి, ఆరోగ్యానికి నాణ్యమైన
"అజంతా"
వక్కపొడి
రవికుమార్ అండ్ కంపెని -
చెన్నై



తెలుగు నటి. ఈ చిత్రానికి హెచ్. ఎం. రెడ్డి దర్శకత్వం వహించారు. ఆమె హిందీ మరియు బెంగాలీ సినిమాలలో కూడా నటించారు. ఆమె అక్క కూతురు సురభి బాలసరస్వతి కూడా సురభి నాటకాల ద్వారా తన నట జీవితాన్ని ప్రారంభించిన తెలుగు సినిమా నటి.

సురభి నాటక బృందాలు ప్రధానంగా గ్రామాల్లోనే ప్రదర్శనలు ఇస్తూ, ఒక చోట నుంచి మరో చోటుకు సంచరిస్తూ జీవించే సంచార జీవన విధానాన్ని అనుసరించేవి. 1991లో అప్పటి ఆంధ్రప్రదేశ్ సాంస్కృతిక శాఖ డైరెక్టర్ అయిన డా. కె.వి. రామణాచారి గారు సురభి నాటకాన్ని నగరాలకు, ముఖ్యంగా హైదరాబాద్‌కు తీసుకురావడానికి కృషి చేశారు. అప్పటి నుంచి అనేక మంది సురభి సంచార కళాకారులు హైదరాబాద్‌లోని శేర్లింగంపల్లి ప్రాంతంలోని సురభి కాలనీలో స్థిరపడారు.

కోవిడ్ మహమ్మారి సమయంలో ప్రజలకు చేరువ కావడానికి సురభి నాటక రంగం ఆన్‌లైన్ వేదికను ఆశ్రయించింది. ప్రపంచంలోని వివిధ దేశాల్లో ఉన్న ఎన్నారై (చీ=×) సమూహాలు ఏర్పాటు చేసిన తెలుగు సాంస్కృతిక సంఘాలు ఈ ఆన్‌లైన్ నాటకాలకు సహకారం అందించేందుకు ప్రయత్నించాయి.

సురభి నాటక బృందాలు తమ సంప్రదాయ విధానాన్ని మార్చుకుని, గతంలో మూడు గంటలకుపైగా సాగిన నాటకాలను ప్రస్తుతం 45 నిమిషాల నుంచి ఒక గంట వ్యవధిలోనే ముగించేలా సంక్షిప్త రూపంలో ప్రదర్శిస్తున్నాయి.

వంశపారంపర్యంగా కొనసాగుతూ వస్తున్న తమ సంప్రదాయ నాటక కళను కాపాడుకోవాల్సిన అవసరం ఒక వైపు, మారుతున్న ప్రపంచానికి అనుగుణంగా ఆధునిక విద్యను నేర్చుకుని ముందుకు సాగాల్సిన తప్పనిసరి పరిస్థితి మరో వైపు ఉండటంతో, సురభి కళాకారులు కత్తిమీద సాములా అతి కష్టసాధ్యమైన సమతుల్యతను సాధించేందుకు ప్రయత్నిస్తున్నారు.

ఈ సంప్రదాయాన్ని కొనసాగిస్తూ, ఆధునిక సమాజానికి అనుగుణంగా మార్చుకునేలా సురభి నాటకాన్ని సురభి కళాకారులని ప్రోత్సహించి, ఆదరించవలసిన బాధ్యత ప్రతీ తెలుగు కళాభిమానుడికి వుంది.

– డాక్టర్. బీ. యస్. వీ. పార్థసారథి

# ఉద్యోగంలో విజయానికి... భగవద్గీత చెప్పే 7 పాఠాలు!

భగవద్గీత! ఐదు వేల సంవత్సరాల నుంచి లోకాన్ని ప్రభావితం చేస్తూ ఉంది. ప్రపంచం ఎంతగా మారినా, మనిషి జీవితం ఎంత మారినా... భగవద్గీత ఇప్పటికీ మనకి దారి చూపిస్తూనే ఉంది. పుట్టుక దగ్గర నుంచీ చావు దాకా, నాయకత్వం దగ్గర నుంచీ యుద్ధం దాకా ప్రతి రంగానికీ ఉపయోగపడుతోంది. అలాంటి భగవద్గీత మన రోజువారీ ఉద్యోగాలలో ఏమన్నా ఉపయోగపడు తోందా అంటే లేకేం...

అర్జునుడు తన ఆయుధాలన్నింటినీ పడేయడంతో భగవద్గీత మొదలవు తుంది. యుద్ధంలో ఎటుచూసినా తనవారే కనిపిస్తున్నారనీ, వారితో తను యుద్ధం చేయలేననీ అర్జునుడు బాధపడతాడు. అప్పుడు కృష్ణుడు అనవసరమైన విషయాల గురించి బాధపడి, పిరికితనానికి లోనుకావద్దని మందలిస్తాడు. ఒక రాజుగా తన కర్తవ్యాన్ని పాలించడమే ధర్మమని బోధిస్తాడు. ఈ సూత్రం ఉద్యోగానికి కూడా ఉపయోగపడుతుంది. తనచుట్టూ ఉన్నవారు ఏమనుకుంటారో, వాళ్లకి ఇబ్బంది కలుగుతుందేమో అన్న ఆలోచనలతో భయంభయంగా ప్రవర్తించకూడదు. ఒక ఉద్యోగిగా మన బాధ్యతలని నూటికి నూరుపాళ్లూ నిర్వర్తించాలి. ఎలాంటి భయమూ, మొహమాటమూ లేకుండా ధర్మాన్ని పాటించాలి. ఆ నిక్కచ్చితనం లేకపోతే ఉద్యోగికీ, సంస్థకీ కూడా నష్టం తప్పదు.

మన బాధ్యతని పాటిస్తాం సరే! మరి ఆ పనికి తగ్గ ఫలితం రాకపోతే ఎలా? అన్న బాధ ఎవరికైనా తప్పదు. 'పనిని సక్రమంగా చేయడం వరకే మన బాధ్యత, ఫలితం మన చేతుల్లో ఉండదు' అన్నది గీతలో ప్రముఖంగా వినిపించే మాట. ఫలితం ఒకోసారి వెంటనే వస్తుంది, ఒకోసారి చాలా... చాలా ఆలస్యంగా పలకరిస్తుంది. మనవైపు నుంచీ ఎలాంటి లోపమూ లేకుండా, నూటికి నూరుపాళ్లూ ప్రయత్నిస్తే... ఎప్పటికైనా విజయం తప్పదు.

ఆఫీసులో రకరకాల మనుషులు ఉంటారు. కొంతమంది పని చేసే తీరు చూస్తే కోపం వస్తుంది, కొంతమంది ప్రవర్తన చూస్తేనే అసహ్యం వేస్తుంది. ఆఫీసులో అందరి ప్రవర్తననీ గమనిస్తూ ఉండాల్సిందే! కానీ అది మన ఆలోచనాతీరుని ప్రభావితం చేయకూడదన్నది గీత చెబుతున్న మాట. భగవద్గీత రెండో అధ్యాయంలోనే కృష్ణుడు కోపం వల్లా, ద్వేషం వల్లా సరైన నిర్ణయాలు తీసుకోలేమని చెప్పుకొస్తాడు.

భగవద్గీతలోని ప్రతి అధ్యాయంలోనూ 'శరీరం శాశ్వతం కాదు, ఆత్మ ఒకటే శాశ్వతం' అన్న మాట వినిపిస్తుంది. ఈ మాట నుంచి రెండు విషయాలు నేర్చుకోవాలంటున్నారు. డబ్బు, హోదాలాంటి తాత్కాలికమైన ప్రలోభాలకి లొంగిపోకూడదన్నది మొదటి విషయం. ఎలాంటి మార్పునైనా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలన్నది రెండో విషయం.

భగవద్గీతలో జ్ఞానానికి చాలా ప్రాధాన్యత కనిపిస్తుంది. అది మనం పెంచుకునేదైనా కావచ్చు. ఇతరుల నుంచి నేర్చుకునేదైనా కావచ్చు. చదువుతో, పరిశీలనతో, గురువులని కలవడంతో వీలైనంత జ్ఞానాన్ని పొందాలని చెబుతాడు కృష్ణుడు. ఉద్యోగంలోనూ అంతే! చేసే పని గురించి అవగాహన సాధిస్తే, ఎలాంటి లక్ష్యాన్నయినా చేరుకోగలం.

Attachment with detachment అనే సూత్రం భగవద్గీతలో స్పష్టంగా కనిపిస్తుంది. నూటికి నూరు శాతం మనసు పెట్టి పని చేయాలి. కానీ పని పూర్తయిన తర్వాత ఇక దాని గురించి ఆలోచించకూడదు. ఆఫీసులో ఇంటి గురించి ఆలోచిస్తూ, ఇంట్లో ఆఫీసు పని గురించి కంగారుపడుతూ ఉండేవారికి ఇదో పాఠం. నిన్న చేసిన పని గురించే ఆలోచిస్తూ కూర్చునేవారికిదో గుణపాఠం.

చివరగా ఒక్క మాట! ఒకరు చెడిపోవడానికైనా, బాగుపడటానికైనా అతని ఆలోచనలే కారణం. మన ఆలోచనలు గొప్పగా ఉంటే, మనకి బెస్ట్ ఫ్రెండ్ మనమే! అదే మన ఆలోచనలు సవ్యంగా లేకపోతే మన బద్ధ శత్రువు కూడా మనమే అని చెబుతోంది భగవద్గీత. ❑

# ఒక్కడు విశ్వనాథ

వ్యాసరచన - శ్రీరమణ గారు



ఆయన ఒక విశ్వవిద్యాలయం. మన సాంప్రదాయాలు కట్టుబాట్లు చెదరరాదని గస్తీ తిరిగిన యుద్ధనౌక! గాఢ ప్రతిభాశాలి. ధిషణాహంకారి. ఆంధ్ర సాహిత్య క్షేత్రంలో చవిశ్వనాథబిసత్యనారాయణ చేయని సేద్యం లేదు, పండించని పంట లేదు. తెలుగుజాతి పట్ల విశ్వనాథకు అలవిమాలిన ఆపేక్ష. ఉత్తరాదిన పుట్టి పెరిగిన రాముడు, విశ్వనాథ ప్రాపకంలో తెలుగురాముడు అయినాడు. నా రాముడని తనివితీరా కలవరించి పలవరించారు. విశ్వనాథకున్న అనుచర వర్గం, శిష్య వర్గం మరొకరికి లేదు. ఇష్టులు, అయిష్టులు కలిసి విశ్వనాథను నాడు నేడు కూడా సజీవంగా ఉంచుతూ వస్తున్నారు. సెప్టెంబర్10 ఆయన జయంతి సందర్భంగా చిరు నివాళి




సాహిత్యం, సంస్కృతి అవిభాజ్యమని, వాటి ఉద్ధరణ కూడా ఏకబిగిని జరగాలని విశ్వనాథ విశ్వాసం. మన దేశ రాజకీయ రంగంలో పండిత మదన్ మోహన మాలవ్యా గారెలాంటివారో, సాహిత్య రంగంలో సత్యనారాయణ అలాంటివారు. ఎన్ని ఎదురుదాడులు తగిలినా, తాను నమ్మిన సిద్ధాంతాలను వీడలేదు. తన మతం మార్చుకోలేదు. అందుకే ఆయనొక యుద్ధనౌక. ఒక మహాశిల్పి గొప్ప ఆలయాన్ని నిర్మించ సంకల్పించాడు. ఏడు ప్రాకారాలు, గాలి గోపురం, ముఖ మండపాలు, సింహద్వారాలు, మహాగోపురం, కోవెల కొలను, చుట్టూ మెట్లు... యింకా ఎన్నో కలిస్తే ఆలయం అవుతుంది. ఆ బృహత్కార్యాన్ని చేస్తూ మధ్య మధ్య ఆ శిల్పి కొన్ని చెక్కుళ్లను రూపొందిస్తాడు. విశ్వనాథవారి చరామాయణబికల్పవృక్షం మహాలయం. సమాంతరంగా వారు వెలువరించిన ఖండకావ్యాలు, లఘు కావ్యాలు, నవలలు, నాటకాలు, గీతాలు, ప్రసంగ వాక్యాలు కల్పవృక్షంతో పాటు పెరిగిన పొగడలు, పొన్నలు, పున్నాగలు. ఈయన బాగానే రాస్తారు గానీ ఒక పట్టాన అర్థం కాదనేవారున్నారు. 'పాషాణపాక ప్రభూ' అని సంబోధించినవారున్నారు. అయినా కల్పవృక్ష మహా నిర్మాణాన్ని ఆయన ఆపలేదు. రామాయణంలో ముఖ్య ఘట్టమైన సీతా స్వయంవరాన్ని సీస పద్యంలో వర్ణించి, తర్వాత తేటగీతిలో:

అతని దృష్టికి జానకి యాగలేదు
అతని కృష్టికి శివధనుస్సాగలేదు
సీత పూజడ వెన్నుగా శిరసు వంచె
చెరుకు గడవోలె నడిమికి విరిగె ధనువు

సీతను చూపిన తీరు ఇది. కవి సమ్రాట్‌కి సందర్భ శుద్ధి ఉంది. ఒక్కొక్క సందర్భానికి తగినట్టు పూర్వకవిని ఆవాహన చేసుకుని ఆ మార్గంలో కథ నడిపించారు. ఆదికవి నన్నయ్య నుంచి నాచన సోమన్నదాకా కల్పవృక్షంలో సాక్షాత్కరిస్తారు. మీ కల్పవృక్షం చాలామందిని కదిలించింది. దాని ప్రేరణలో విషవృక్షం కూడా మొలిచిందండీ అంటే "ఔనౌను, ఎవరి మార్గం వారిది. నేను వెర్రివాడిని. నాకు ఏడు జన్మలకు గాని ముక్తి లేదు. వారిది వైరిమార్గం. జయ విజయులు చూపిన దారి. మూడు జన్మలకే ముక్తి!" అనేవారు, అలవాటుగా ఉండే ధూ... ధూల మధ్య.

తెల ుగుునాట చా లా ప్రాచుర్యం ఎాందిన విశ్వనాథ నవల చవేయిపడగలు . ఆంధ్ర విశ్వవిద్యాలయం నిర ్వహిం చి న నవలల పోటీ కోసం రాశారు. వెయ్యి పేజీల నవల. ఆ పోటీలో కడదాకా నిలచిన నవలలు మూడు. వేయి పడగలు, అడివి బాపిరాజు నారాయణరావు నవల, చలం మైదానం. మైదానం నవల పేజీల నియమావళికి నిలవలేదు. ఇక నిలిచినవి రెండు. విశ్వవిద్యాలయం ప్రకటించిన వెయ్యి రూపాయల బహుమతిని చెరి సగం చేశారు. బాపిరాజుకి అయిదు వందల యాభై, విశ్వనాథకి అయిదు వందలు ఇచ్చారు. అందులో కథానాయకుడు నారాయణరావు బాపిరాజే. వేయి పడగల కథానాయకుడు ధర్మారావు విశ్వనాథే. వందేళ్ల తెలుగు జీవితాన్ని అద్భుతంగా చిత్రించి, వేయి పడగలు నవల తెలుగుజాతి స్వీయకథ అనిపించారు. నైతిక సూత్రాల పట్ల, సాంప్రదాయ జీవన మార్గం పట్ల విశ్వనాథకు ప్రగాఢ గౌరవం, తిరుగులేని విశ్వాసం ఉన్నాయి. ఆయన వేయి పడగలు నవలలో ప్రతిపాదించిన అంశాలు, వారి తర్వాతి నవలలకు విస్తరించి కనిపిస్తాయి.

విశ్వనాథ ఏకవీర నవల తెలుగు కాల్పనిక సాహిత్యంలో విలక్షణమైనది. నాలుగు పాత్రలను నాలుగు స్తంభాలుగా మలచి మహామండపాన్ని నిర్మించారు. మధురై దగ్గరి వైగై నది చుట్టూ ఈ కథ తిరిగి, చివరకు వైగై నదిలోనే ముగుస్తుంది. ప్రేమ, ప్రణయం ఎంతటి గొప్ప ఉద్వేగపూరితమైనవి అయినా, శృంగార భావాలు మధురమైన కోరికలు ఎంతటి విశృంఖలమైనవి అయినా, హద్దు మీరకుండా నిగ్రహించుకోవడమే భారతీయ సంప్రదాయమని ఏకవీర తీర్మానిస్తుంది.

విశ్వనాథ చచెలియలికట్ట నవల మరో కడలి తరంగం. అప్పట్లో 'ఫ్రీ లవ్ సొసైటీ' పేరుతో ఒక సమాజం తెరమీదకు వచ్చింది. ఆ వెర్రితలని దృష్టిలో పెట్టుకుని చెలియలి కట్ట రచించారు. ఇది కేవలం సాంఘిక నవల మాత్రమే కాదు, మానసిక పరిణామ దశలను విశ్లేషించిన ఒక సూత్ర గ్రంథం. సిగ్మండ్ ఫ్రాయిడ్ నుంచి భారతీయ మనో విశ్లేషణలన్నింటినీ పుక్కిలిపట్టిన విశ్వనాథ చెలియలికట్ట నవలలో రత్నావళిని విశిష్టంగా రూపొందించారు. చివరకు ఆమెనొక కర్మయోగినిగా మలచారు. చెలియలికట్ట చలం మైదానం నవలకి కౌంటర్‌గా రాశారని కొందరంటారు. కాని అది కాదు. బరి తెగించిపోతున్న నైతిక సూత్రాలకు అడ్డుకట్ట వేసే ప్రయత్నం చెలియలి కట్ట. నవలల్లో యదార్థ జీవన చిత్రణ



చేసే సంప్రదాయాన్ని అంటే డాక్యుమెంటరీలను విరివిగా విశ్వనాథ రాశారు. వేయి పడగలు నవలలో చాలా పాత్రలకు మాతృకలు ఉన్నాయి. తెరచిరాజు నవల ముంజులూరి కృష్ణారావు జీవితం. ఆయన గొప్ప నటుడు. విశ్వనాథ కొంతకాలం కరీంనగరం కళాశాల ప్రిన్సిపాల్‌గా పనిచేశారు. అక్కడ లాయర్ వృత్తిలో ఉంటూ సంగీతాన్ని ఉపాసించే గాయక సార్వభౌముడు నారాయణరావు ఉన్నారు. కరీంనగర్ పరిసరాలలోనే మ్రోయు తుమ్మెద అనే వాగు ఉంది. నిరంతరం లయాత్మకంగా ధ్వనిస్తూ ప్రవహించే ఆ వాగు పేరుతో ఆ సంగీత సార్వభౌముని జీవితాన్ని సాక్షాత్కరింపజేశారు.

విశ్వనాథ నవలలన్నింటినీ ఒక లక్ష్యంతో ఒక ప్రయోజనంతో రాశారు. వాటిని చాలామంది ఆ విధంగా అర్థం చేసుకోలేదని విశ్వనాథ ఆవేదన పడేవారు. ఏవిష్ణుశర్మఇంగ్లీషుచదువు, ఏదమయంతిస్వయంవరం వీటిలో విశ్వనాథ వ్యంగ్య వైభవపు అంచులు చూడచ్చు. బద్దన్న సేనాని, వీరవల్లడు వీటిదొక తీరు. మా బాబు, జేబుదొంగలు మరొక తీరు. తర్వాత్తర్వాత ఎమెస్కో పాకెట్ బుక్స్‌గా రాసిన కాశ్మీర పట్టమహిషి, చిట్లీ చిట్లని గాజులు, దిండు కింద పోకచెక్క, దంతపు దువ్వెన లాంటి కాశ్మీర కథల పరంపర వేరొక తీరు.

విశ్వనాథ ఖండ కావ్యాలు రాసినా, వచనం రాసినా, లఘు కావ్యాలు రాసినా కండ పుష్టి గల రచనలే చేశారు. తన ప్రతిభను గ్రంథాలలోకి దించి, జాతికి అందించగలిగిన మహానుభావుడు విశ్వనాథ. సనాతన భారతీయ తత్వాన్ని త్రికరణశుద్ధిగా నమ్మిన జ్ఞాని. విశ్వనాథ రచనలలో 'జీవుడి వేదన' అనే మాట తరచూ వినిపిస్తుంది. ఇది ఆయన స్వేచ్ఛాచింతనకు ఒక ఉదాహరణ. ప్రతి మనిషికీ కొన్ని తనవైన ఆలోచనలు ఉంటాయి. సొంత ఘోష ఒకటి ఉంటుంది. అదే ఆయన ప్రతిపాదించిన జీవుడి వేదన.

దీనిని విశ్లేషించి, సమగ్రంగా పరిశోధిస్తే ఒక వినూత్న తాత్విక సిద్ధాంతం ఆవిష్కృతమవుతుంది. విశ్వనాథ నాటకాలలో వేనరాజు, నర్తనశాల, అనార్కలి ప్రసిద్ధమైనవి. ప్రాచీన కవుల రచనలపై విశ్వనాథ విశ్లేషణ వ్యాసాలు నేటి విమర్శకులకు పాఠ్య గ్రంథాలు. ఏ కవిని ఎక్కడ ఎలా దర్శించాలో ఆయనకు తెలుసు. 'మెంతి మజ్జిగ రుచి మెంతి మజ్జిగదే. పరవాన్నం రుచి పరవాన్నందే. బాగుండడమంటే వాటి జీవలక్షణాలను బట్టి తేల్చాలి'... ఇలాంటి కొలత బద్దలతో విశ్వనాథ విమర్శ సాగుతుంది. సాహిత్యంలో ఉన్న శాఖలన్నీ విశ్వనాథకు ఆటపట్లు. కోకిలమ్మ పెండ్లి, కిన్నెరసాని పాటలు, ఉయ్యాల తాళ్లు లాంటి గేయ కావ్యాలు, విశ్వనాథ మధ్యాక్కరలు వేటికవే ప్రత్యేకం.

1895 సెప్టెంబర్ 10న కృష్ణాజిల్లా నందమూరులో జన్మించిన విశ్వనాథ కార్యక్షేత్రాన్ని కడదాకా బెజవాడనే చేసుకున్నారు. విశ్వనాథకు సాహిత్యంలోనే కాదు, జీవితంలోనూ ముందుచూపు ఉంది. తన పుస్తకాలు కనుమరుగు కాకుండా కొత్తతరాల వారికి లభిస్తూ ఉండాలంటే, స్వయంగా తనే ఒక ప్రచురణ సంస్థని స్థాపించి ముద్రించాలని అనుకున్నారు. 'విశ్వనాథ సత్యనారాయణ అండ్ కో'ని ప్రారంభించారు. ఆయన రచనలన్నీ అప్పటికీ ఇప్పటికీ ఆ సంస్థ పేరు మీదే వెలువడుతున్నాయి.

విశ్వనాథ సహస్ర మాసోప జీవి. పొందతగిన అన్ని గౌరవాలూ పొందారు. తీసుకోవలసిన అన్ని బిరుదులూ తీసుకున్నారు. ఆనాటి ప్రముఖులు పి.వి.నరసింహారావు, తెన్నేటి విశ్వనాథం, టంగుటూరి ప్రకాశం, బెజవాడ గోపాలరెడ్డి, కళా వెంకటరావు, మండలి కృష్ణారావు ఆయన శిష్యవర్గంలోని వారు. విశ్వనాథ సాహిత్య అకాడమీ ఉపాధ్యక్షులుగా, శాసన మండలి సభ్యులుగా తమ సేవలు అందించారు. జాతీయోద్యమం నేపథ్యంలో తన మొదటి నవల 'అంతరాత్మ'ని ప్రారంభించారు గాని, అది అసంపూర్ణంగానే మిగిలింది. ప్రచురితమైన తొలి నవల ఏకవీర.

విశ్వనాథ సమకాలికులెవరూ సామాన్యులు కారు. చెళ్లపిళ్లవారు విద్య నేర్పిన గురువులు. అప్పుడప్పుడే రకరకాల ఇజాలు రెక్క విప్పుతున్న రోజుల్లో, విశ్వనాథ ఒంటరిపోరుకి తలపడ్డారు. తలపడి నిలిచారు. నిలిచి గెలిచారు. శతాధిక గ్రంథకర్త. ప్రతి గంథం ఒక ప్రత్యేకతను సంతరించుకుని బతికి బట్టకట్టింది.

భోజన ప్రియులు

విశ్వనాథ మంచి భోజనప్రియులు. ఆయన రుచులు వింతగా ఉండేవి. తీవ్రస్థాయిలో ఆవకాయ కలుపుకుని, ఆ ముద్ద తింటూ పచ్చిమిరపకాయ కొరుక్కునేవారు. అదీ ఆంధ్ర పౌరుషం!

విశ్వవేదన

జీవితాన్ని సంపూర్ణంగా తరచి చూసినవాడు, అర్థం చేసుకున్నవాడు విశ్వనాథ. హాలాహలం ఎలాంటిదో తెలుసు, అమృతమేమిటో తెలుసు. "బాల్యంలో తల్లిని, యవ్వనంలో భార్యని, వృద్ధాప్యంలో కొడుకుని పోగొట్టుకున్నవాణ్ని. వేదనకి అర్థం నాకు తెలిసినంతగా మరెవరికి తెలుస్తుంది" అన్నారొక చోట. విన్నవారికి కనులు చెమర్చాయి. నూత్న యవ్వనంలో అంటే ఇరవై రెండేళ్ల వయసులో విశ్వనాథ రాసిన పద్యాలలోంచి – అతి సామాన్యమైన, సార్వజనీనమైన విషయాన్ని చెప్పి, కనిపించని దేవుణ్ని ప్రశ్నార్థకం చేశారు. ఇది ఎన్నిసార్లు చదివినా మనసు ఆర్ద్రమవుతుంది. ఒక దిగులు, ఒక అశక్తత ఆవరిస్తాయి. విశ్వనాథ సామాన్యుడు. ఆయన ఆలోచనలు అసామాన్యాలు. ఈ పద్యపాదాలు శరణాగతికి పరాకాష్ట.

నా కనుల యెట్టయెదుటన నా జనకుని
నా జనని కుత్తుకలను కోసి నన్నెడిగెన
తండు "నే దయాంబుధిని కాదా" యటంచు
ఓ ప్రభూ! యగునంటి నే నొదిగి యుండి
నా కనుల యెట్టయెదుటన నా లతాంగి
ప్రాణములు నిల్వునందీసి యడిగెనను న
తండు "నే దయాంబుధిని కాదా" యటంచు
ఓ ప్రభూ! యగునంటి నేనొదిగి యొదిగి
తనుజు కుత్తుక నులిమి తానను నడిగెన
తండు "నే దయాంబుధిని కాదా"
యటంచు
ఓ ప్రభూ! యగునంటి నేనొదిగి పోయి.
ఉపమా విశ్వనాథస్య

విశ్వనాథ ఉపమానాలు ప్రత్యేకంగా ఉంటాయి. ఇంతకుముందు ఎక్కడా మనకు కనిపించవు. తర్వాత కనిపించడం లేదు. కారణమేమంటే విశ్వనాథ చూపు వేరు.

❖ ఆమె మంచముపై పరున్న గోధుమవన్నె త్రాచువలెనున్నది.

- ❖ ఒంటినిండ మసి పూసికొనిన దొంగవలె సంజ చీకటి తొంగి చూచినది.
- ❖ జొన్న చేనిలో మంచెయే గాని సౌధము.
- ❖ ఆమె వదనము పావురాయి పొట్టవలె మృదువుగా తళతళలాడుచున్నది.
- ❖ ఆమె కంకె విడిచి మురువు వొలుకు పంటచేను.ల
- ❖ ఆ సువాసనల చేత దీపం ఆరిపోవునేమోనని భయపడితిని.
- ❖ ఇంద్ర ధనుసు ముక్క పులి తోకలా ఆకాశంలో కనిపిస్తోంది.
- ❖ శరదృతువులో కొంగలబారు ఎగురుతుంటే, ఆకాశమనే పాముల చిన్నదాని మెడలోని నత్తగుల్లల పేరులా వుంది.
- ❖ గుమ్మడి పువ్వులో కులికే మంచు బిందువు, తట్టలో కూర్చుండబెట్టిన నవవధువులా తోచింది.
- ❖ గుండెలపై బోర్లించి పెట్టిన పుస్తకము వలె పసివాడు పడుకున్నాడు.

సమకాలికులు విశ్వనాథని ఒక మెట్టుపైనే కూచోపెట్టి గౌరవించారు. కొందరాయన మార్గాన్ని అనుసరించలేక, కొందరాయన అభిప్రాయాలతో ఏకీభవించలేక దూరంగా జరిగారు. అభిప్రాయాల గురించి మాట్లాడితే, ఆయనకు చిరాకు. ఒకసారి ప్రసిద్ధ సంపాదకులు నార్ల వెంకటేశ్వరరావు, "వారికీ మాకూ అభిప్రాయ భేదాలున్నప్పటికీ..." అనేనరికి, వి॥న॥నా రెచ్చిపోయారు. "ఏడ్చి, సొంత అభిప్రాయాలున్నవారికి భేదాలు గాని, నీకూ నాకూ ఎందుకు? మీరు మార్క్సుని భుజాన వేసుకుని, నేను శంకరాచార్యుని పట్టుకుని వేలాడుతున్నాం. మనకెందుకు అభిప్రాయ భేదాలు..." అని వాదన పూర్తిచేశారు. సినిమా లాంటి శక్తివంతమైన మాధ్యమాలతో సంబంధం లేకున్నా, తెలుగునాట ఆబాల వృద్ధులకు విశ్వనాథ పేరు యెరుకే. అంతగా తెలుగువారిని చదివించినవారు లేరు. అంతగా అర్థం కానివారూ లేరు. విశ్వనాథతో పోల్చదగినవారు విశ్వనాథ మాత్రమే! అందుకే ఒకడు విశ్వనాథ. కాదంటే ఒకే ఒక్కడు విశ్వనాథ. ❑

**Statement about ownership and other particulars about Newspaper**
**"PRAMUKHANDRA" Chennai - 600 004.**
**FORM IV (See Rule 8)**

| | | | |
|---|---|---|---|
| 1. | Place of Publication | : | Chennai |
| 2. | Periodicity of itsPublication | : | Monthly |
| 3. | Printer's Name | : | **G.V. RAO** |
| | Nationality | : | Indian |
| | Address | : | Printed at **Goteti Graphics** 64, Thambaiah Reddy Road, West Mambalam, Chennai - 600 033. |
| 4. | Publisher's Name | : | **G.V. RAO** |
| | Nationality | : | Indian |
| | Address | : | 64, Thambaiah Reddy Road, West Mambalam, Chennai - 600 033. |
| 5. | Editor's Name | : | **G.S. RAMARAO** |
| | Nationality | : | Indian |
| | Address | : | 64, Thambaiah Reddy Road, West Mambalam, Chennai - 600 033. |
| 6. | Name & Address of individuals who own the Newspaper and Partners | : | **GV RAO** 64, Thambaiah Reddy Road, West Mambalam, Chennai - 600 033. |

I, **G.V. RAO** hereby declare the particulars given above are true to the best of my knowledge and belief.

Date : 28-2-2026 — **(Sd.,) GV RAO**
Chennai - 600 033. — PUBLISHER

# పంచముఖాంజనేయుడు



సీతను చేజిక్కించుకునేందుకు రామరావణుల మధ్య భీకర సంగ్రామం మొదలవుతుంది. రాముడు సాధారణ మానవుడే కదా అనుకుంటూ పోరులోకి దిగిన రావణుడు, యుద్ధం గడుస్తున్న కొద్దీ తన సైన్యం పల్చబడిపోవడాన్ని చూసి ఆశ్చర్యపోతాడు. తన కుమారుడైన ఇంద్రజిత్తు సైతం యుద్ధంలో నేలకూలడంతో బెంబేలువడిపోతాడు. వెంటనే పాతాళలోకానికి అధిపతి అయిన తన బంధువు మైరావణుని సాయం కోరతాడు. మైరావణుడి నుంచి రామలక్ష్మణులకు ప్రమాదం పొంచి ఉందని గ్రహించిన హనుమంతుడు వారి చుట్టూ ఎంత కాపలాను ఉంచినా.... అందరి కళ్లూ కప్పి రామలక్ష్మణులను పాతాళలోకానికి అపహరించుకుపోతాడు మైరావణుడు.

హనుమంతుని పయనం: రామలక్ష్మణులను వెతుక్కుంటూ తాను కూడా పాతాళానికి చేరుకుంటాడు హనుమంతుడు. అక్కడ మైరావణుని రాజ్యానికి రక్షగా నిలుచున్న మకరధ్వజుడు అనే వింతజీవిని చూస్తాడు. ఇంతకీ ఆ మకరధ్వజుడు మరెవ్వరో కారనీ... తన శరీరం నుంచి వెలువడిన స్వేదాన్ని ఓ జలకన్య గ్రహించడం వల్ల జన్మించిన తన కుమారుడేనని తెలుస్తుంది. అయినా ఉద్యోగధర్మాన్ని అనుసరించి మకరధ్వజుడు, హనుమంతునితో యుద్ధానికి సిద్ధపడతాడు. ఇరువురి మధ్యా జరిగిన భీకర పోరులో హనుమంతునిదే పైచేయి అవుతుంది.

మైరావణుని సంహారం: మైరావణుని రాజ్యంలో ప్రవేశించిన ఆంజనేయుడు అతనితో యుద్ధాన్ని ఆరంభిస్తాడు. కానీ ఒక ఉపాయాన్ని సాధిస్తే తప్ప మైరావణునికి చావు సాధ్యం కాదని తెలుసుకుంటాడు. మైరావణుని పురంలో ఐదు దిక్కులా వెలిగించి ఉన్న దీపాలను ఒక్కసారిగా ఆర్పితే కానీ అతనికి చావు మూడదని తెలుస్తుంది. అందుకోసం తూర్పు, పశ్చిమము, ఉత్తరము, దక్షిణము, ఊర్ధ్వముఖం... ఇలా అయిదు దిక్కులా అయిదు ముఖాలను ధరించి, అయిదు దీపాలను ఒక్కసారిగా ఛేదిస్తాడు. పంచముఖాలతో పాటుగా ఏర్పడిన పది చేతులలో ఖడ్గం, శూలం, గద వంటి వివిధ ఆయుధాలను ధరించి... మైరావణుని అంతం చేస్తాడు. అతనే పంచముఖాంజనేయుడు. ❑


**SRI RAJARAJESWARI JEWELLERY**

**The Oldest Jewellery Shop in Pondy Bazaar**

**81, Pondy Bazar, T. Nagar, Chennai - 600 017.**
**Phones : 28152387, 28154653**

***The Purest Treasurer Mortal Times Afford is Spotless Reputation***

# క్షేత్రపాలకుడు...!!!



క్షేత్ర పాలకుడు అంటే ఆ క్షేత్రాన్ని పాలించేవాడు, రక్షించేవాడు అని అర్థం.

ముఖ్యంగా క్షేత్రాలలోని ఆలయాలకు తప్పకుండా ఈ క్షేత్రపాలకుడు ఉంటాడు. భక్తులు తప్పనిసరిగా ఆ స్వామిని దర్శించుకోవడం క్షేత్రనియమంగా వస్తోంది.

సాధారణంగా క్షేత్రపాలకుడంటే శివుడే అని శైవాగమాలు చెప్తున్నాయి. వైష్ణవాగమాల్లో కూడా దండపాణిగా శివుడే క్షేత్రపాలకుడుగా దర్శనమిస్తాడు.

శివాలయంలో ఈయన ముఖ్యదేవతగా ఉంటాడు. శివాలయంలో ఆగ్నేయదిక్కున ఈ స్వామి ఆలయం ఉంటుంది.

భక్తులు ముందుగా ఈయనను దర్శించి శివ దర్శనం.. శివార్చన కొరకు అనుమతి పొందిన తరువాతే ఆలయంలోకి అడుగుపెట్టాలనే నియమం కూడా ఉంది. ఈ నియమం ఒక్క భక్తులకే కాక అర్చనాది కైంకర్యాలు జరిపే అర్చకులకు కూడా ఉంది.

ముఖ్యంగా అర్చకులు శివాలయానికి వేసిన తాళాలను ఈ క్షేత్రపాలకుడి వద్దే ఉంచి వెళ్తారు.

ఉదయాన్నే ఆలయం తెరిచే ముందు ఈయన అనుజ్ఞ తీసుకొని అర్చనాది కార్యక్రమాలు మొదలుపెడతారు.

ఈశ్వరుడి వెయ్యో అంశగా క్షేత్రపాలకుడు ఉద్భవించినట్లు సుప్రభేదాగమం చెప్పింది.

గ్రామానికి ఈశాన్యంలో లోకరక్షణ కోసం ఈయనకు ప్రత్యేకంగా ఆలయం కూడా నిర్మించాలని ఆగమశాస్త్ర నియమం.

క్షేత్రపాలకుడు నల్లని మబ్బులవంటి శరీరవర్ణంతో.. గుండ్రటి కన్నులతో.. నగ్నంగా.. పదునైన పళ్లకోరలతో.. భ్రుకుటిని ముడిచి.. ఎర్రటి పొడవైన కేశాలతో.. శరీరంపై కపాలమాలలతో.. చేతుల్లో త్రిశూలం, కపాలం వంటి ఆయుధాలతో నిలుచుని.. భైరవవాహనంతో ఉంటాడు.

కాశ్యప శిల్పశాస్త్రం ఆయన చేతులు, ధరించే ఆయుధాలను బట్టీ సాత్త్విక, రాజస, తామస మూర్తులుగా విభజించింది.

తెల్లగా.. శాంతముఖంతో.. రెండు/నాలుగు చేతులతో.. అభయ-- వరదముద్రలతో.. రెండు ఆయుధాలతో ఉన్న స్వామి సాత్త్విక క్షేత్రపాలకుడు. ఎర్రగా.. ఉగ్రముఖంతో ఆరు చేతుల్లో ఆయుధాలు పట్టిన మూర్తి రాజసిక క్షేత్రపాలకుడు.

నల్లగా.. తీక్షణంగా చూస్తూ.. మూడు కన్నులతో.. నాగాభరణాలతో.. ఎనిమిది చేతులతో తామసిక క్షేత్రపాలకుడు ఉంటాడు.

శ్రీవిద్యార్ణవ తంత్రం క్షేత్రపాలకుడు.. అనల, అగ్నికేశ,కరాళ, ఘంటికారవ, మహాకోప, పిశితాశ, పింగాక్ష, ఊర్ధ్వకేశులనే అష్ట (8) కింకరులను కలిగి ఉంటాడని పేర్కొంది.

క్షేత్రపాలకుడు ఆలయానికి.. గ్రామానికి.. క్షేత్రానికి ముఖ్యమైన దేవుడనీ.. తొలుత ఆయన్నే పూజించాలని శాస్త్రోక్తి.

జననానుడిలో.. కొన్ని స్థలమాహాత్మ్యాల్లో మాత్రం శివక్షేత్రానికి విష్ణువు.. విష్ణుక్షేత్రాలలో శివుడు క్షేత్రపాలకులని ఉంది.

ఉదాహరణకు తిరుమల ఆలయంలో ఈశాన్యంలో క్షేత్రపాలక రుద్రశిల ఉంది.

అలాగే గోగర్భం జలాశయం వద్ద ఉన్న ఒక పెద్ద రుద్రశిలను భక్తులు దర్శిస్తారు. అలాగే పంచారామ క్షేత్రాలన్నింటికీ విష్ణువు క్షేత్రపాలకుడై ఉన్నాడు. వీరేగాక భద్రాచలం, కొన్ని నృసింహ క్షేత్రాలకు ఆంజనేయస్వామి, శ్రీశైలానికి వీరభద్రుడు,

బద్రీనాథ్ క్షేత్రానికి ఘంటాకర్ణుడు, వారణాసి, శ్రీకాళహస్తి, ఉజ్జయిని క్షేత్రాలలో కాలభైరవుడు క్షేత్రపాలకులు. క్షేత్రపాలకుడి దర్శనం, పూజ విశేష ఫలితాలిస్తాయి...

## శ్రీనాధపోతనల పేర్లు విననివారుండరు

భక్తి జ్ఞానాలు రెండూ జంటగా వుంటాయి. తెలుగు సాహిత్యంలో శ్రీనాధపోతనల పేర్లు విననివారుండరు. ఇద్దరూ మహా పండితకవులే. ఒక । విధంగా చూస్తే శాస్త్ర వాసన పూర్తిగా వున్నవాడు శ్రీనాథ మహాకవి. అయినా వీరిరువురిలో చాలా భేదముంది.

శ్రీనాధుడు శాస్త్రపాండిత్యానికి రాజస కవిత్వానికి ప్రాధాన్యమిచ్చి రాజుల నాశ్రయించి ఐహిక భోగాసక్తుడై అహంకారంతో విచ్చలవిడిగా సంచరించిన కీర్తి కాముకుడు అలా అని భక్తిలేనివాడు కాదు. "ఈశ్వరార్చన కళాశ్రీ" అని శ్రీనాధునికి కీర్తి వుండేది. కాని అహంకారాది లౌకిక విషయాల చాటున భక్తి మరుగున పడింది.

పోతన సహజ పండితుడు. పూర్తిగా శ్రీనాధుని తత్త్వానికి వ్యతిరేక తత్వం పోతనది. అతడు లౌకిక ప్రజాధురంధరుడు, ఇతడు ఆధ్యాత్మిక విద్యా సంపన్నుడు. ఇతనిలో నిండా వున్నది భక్తి. శ్రీనాధుని లోనున్నది రక్తి. శ్రీనాధుడు రాగి, ఇతడు విరాగి, రాజోపచారాలతో తేలియాడేవాడు శ్రీనాధుడు. వాటిని మీసాలపై తేనెలుగా భావించే మహాతాత్త్వికుడు పోతన, శ్రీనాధుడు రాజుల నమ్మి రసికుడుగా భోగాల ననుభవించేవాడు.

పోతన పాండిత్యాన్ని, కవిత్వాన్ని రాజుల పరం చేయకుండా కేవలం ఆ భగవంతునికే అర్పణ చేసికొన్న మహానుభావుడు. దేనికీ తాను కర్తను కాదనుకొన్న నిరహంకారుడు. నిరాడంబరుడు. పోతన భాగవతములో గజేంద్రమోక్ష ఘట్టంలో మొసలిచే పట్టుకోబడిన గజేంద్రుని రక్షించటానికి శ్రీమన్నారాయణుడు వున్నపళంగా లేచి వెళ్ళాడు. ఏ ఆయుధాలు తీసికొని వెళ్ళ లేదంటూ, "సిరికించెప్పుడు శంఖచక్రయుగముల దోయి సంధింపడు అంటూ పద్యం వ్రాశాడు.

ఆ పద్యం విని శ్రీనాధుడు "ఏమయ్యా మహావిష్ణువుకు అంత అత్యవసర పరిస్థితి ఏమొచ్చింది? ఒట్టి చేతుల్తో వెళ్ళి యేం చేద్దామనుకొన్నాడు పాపం ! ఇది సామాన్యుడికి కూడా తెలిసిన విషయమే" అని అపహాస్యం చేశాడు...

ఇంతలో శ్రీనాధుని కొడుకు నూతిలో పడ్డాడనే వార్త వచ్చింది. నూతిలో శ్రీ పెద్ద పెద్ద శబ్దం కూడా వినిపించిది. భోజనం చేస్తున్న శ్రీనాధుడు వినంగానే హుటాహుటీన లేచి బావి వద్దకు వెళ్ళాడు. తీరాచూస్తే ఎవరూ పడలేదు. అమ్మయ్యా అనుకొన్నాడు శ్రీనాధుడు.

పోతన నవ్వుతూ "ఏం బావగారూ! అంట చేత్తోనే ఆదరాబాదరాగా వచ్చారు. పాపం! నిచ్చెన తాడు పట్టుకురాలేదేమండీ! ఎలా రక్షిద్దామనుకొన్నారు?" అని అన్నాడంతే. శ్రీనాధునికి అర్థమైంది. యీ ఎత్తి పొడుపు. సిగ్గుపడ్డాడు.

పోతన భక్తి పారవశ్యంతో వ్రాసినప్పుడు కేవలం అనుభూతే వుంటుంది. సర్వలోకాల్లో నున్న తన భక్తుని ఆర్తనాదాన్ని విన్నప్పుడు ఆప్యాయంతో అవ్యాజకరుణతో పరమాత్మ పట్టి చేతులతో రావటమే లోకానుభవానికి దగ్గరగా వుంది. ఈయనగారి భాగవతమంతా భక్తిరసంతో నిండి పొంగిపోయే మహాభాండం. పోతన భాగవతం చదివే ప్రతి పాఠకుని హృదయం దివ్యానుభూతిని పొందక తప్పదు. కారణం అది భక్తి ప్రధానం కావటమే.

"భక్తి హీనంతు పాండిత్యం శవాలంకృతి సన్నిభం."

భక్తి లేని సంగీతంలాగా పాండిత్యం కూడా శవాలంకరణతో సమానం. పరమార్థ దూరము. "శబ్దజాలం మహారణ్యం" అన్నట్లు పెద్ద పెద్ద సమాసాలు : నిఘంటువులో మాత్రమే దొరికే పదాలను ఏరిఏరి వేసే పదాలతో వ్రాసే ఆడంబర కవిత్వం నీరసమైనది. భక్తి పూర్ణ పాండిత్య, కవిత్వాలే భగవంతునికి కూడా చాలా ఇష్టం.

# ఒక తమిళ వ్యక్తి లితెలుగు భాష గురించిలి రాసిన వ్యాసాన్ని యధాతధంగా

ఒక తమిళ వ్యక్తి లితెలుగు భాష గురించి రాసిన వ్యాసాన్ని యధాతధంగా.....

నా మాతృ భాష తమిళ భాష. దాని అర్థం ఇతర భాషల ను గురించి తెలియదని కాదు. తెలుగు భాష గురించి నాకు తెలిసిన కొన్ని విషయాలను మీతో పంచుకోవాలని భావిస్తున్నాను.

తెలుగు మాతృ భాష గా ఎవరికి వున్నదో, తెలుగు భాష ను ఎవరు ప్రేమిస్తున్నారో, తెలుగు గురించి ఎవరు తెలుసుకుందాము అనుకుంటున్నారో వారి కోసం కొన్ని విషయాలు.

1. తెలుగు భాష సుమారు క్రీ. పూ. 400 క్రితం నుండి వుంది.

2. 2012 లో తెలుగు లిపి ప్రపంచం లోనే రెండవ గొప్ప లిపిగా "International Alphabet Association" ద్వారా ఎన్నుకోబడినది. మొదటి లిపిగ కొరియన్ భాష.

3. తెలుగు భాష మాట్లాడడం వల్ల మన శరీరం లో గల 72000 నాడులు వుత్తేజితమౌతాయని శాస్త్రం ద్వారా నిరూపితమైంది. మిగిలన భాష ల కన్న ఇది చాలా చాలా ఎక్కువ.

4. శ్రీలంక లో గల జిప్సీ తెగ ప్రజలు ఎక్కువగా తెలుగు మాట్లాడతారు.

5. మయన్మార్ లో చాలా మంది తెలుగు మాట్లాడతారు.

6. ఇటాలియన్ భాష లాగానే తెలుగు భాష లో కూడా పదాలు హల్లు శబ్దం తో అంతమౌతాయని 16 వ శతాబ్దంలో ఇటలీ కి చెందిన నికోలో డీ అనే శాస్త్రవేత్త కనుగొన్నాడు. అందుకే తెలుగు భాషను "ఇటాలియన్ ఆఫ్ ద ఈస్ట్". అని అంటారు .

7. భారత దేశంలో తెలుగు మాట్లాడే వారి సంఖ్య సుమారు 75 మిలియన్లు.

ఇది మన దేశంలో మూడవ స్థానాన్ని, ప్రపంచం లో 15 వ స్థానం ను పొందింది.

8. తెలుగు అనే పదం త్రిలింగ అనే పదం నుండి వచ్చినట్లు చెపుతారు. హిందూ పురాణాల ప్రకారం త్రిలింగక్షేత్రాలు నైజం ప్రాంతం లోని కాళేశ్వరం, రాయలసీమ లోని శ్రీశైలం, కోస్తా లోని భీమేశ్వరమ్ ల మధ్యలో వుండడం వలన ఈ పేరు వచ్చిందని అంటారు.

9. ప్రపంచ ఉత్తర ప్రాంతంలో తెలుగు భాష లో మాత్రమే ప్రతి పదం హల్లు శబ్దం తో పూర్తి అవుతుంది.

10. తెలుగు భాష లో వున్న అన్ని సామెతలు, నుడికారాలు ఇంకా ఏ భాష లోన లేవు.

11. తెలుగు భాష ను పూర్వం తెనుంగు, తెలుంగు అని వ్యవహరించేవారు.

12. భారతీయ భాషలలో తెలుగు అంత తీయనైన భాష మరి ఏదీ లేదని విశ్వకవి రవీంద్రనాథ్ టాగూర్ అన్నారు.

13. 200 సం. ల క్రితం మొక్కలు నాటే పని కోసం సుమారు 400 మంది తెలుగు వారు మారిషస్ వెళ్ళారు. ప్రస్తుత మారిషస్ ప్రధాని వారి సంతతే.

14. రామాయణ మహభారతాలు లో దాదాపు 40 శ్లోకాలు కచిక పదాలతో కూడిన పద్యాలు వున్నాయి. ఈ విధంగా మరి ఏ భాష సాహిత్యం లో కూడా లేదు. కచిక (palindrome words) పదాలు అనగా ఎటునుండి చదివిన వోకే రకంగా పలికేవి. ఉదాహరణకు వికటకవి, కిటికి, మందారదామం, మడమ వంటివి.

15. శ్రీకృష్ణ దేవరాయలు ఆముక్త మాల్యద అనే గ్రంథాన్ని తెలుగలో వ్రాసి, "దేశభాషలందు తెలుగు లెస్స" అని చెప్పి తెలుగు ను తన సామ్రాజ్యం లో అధికార భాష గా చేసాడు.

16. ఏకాక్షర పద్యాలు గల భాష తెలుగు మాత్రమే. తెలుగు భాష ఔత్సాహికులకు కావలసినంత ఉత్సాహాన్ని, సృజనాత్మకత ను అందిస్తుంది ఆనడం లో ఏమాత్రం సందేహం లేదు.

పై విషయాలు అన్నీ వొక తమిళ వ్యక్తి ఆంగ్లం లో తెలియజేసిన విషయాల ను అనువదించారు. కానీ ఇది నిజం. ఇంత గొప్ప మన భాషను మన భావి తరాలవారికి సగర్వంగా అందించే బాధ్యత మన తరం పై వుంది. తెలుగు భాష ను చంపేసే తరం గా మనం వుండకూడదని నా భావన.

ఏ భాష ప్రజలైన వారి మాతృ భాషలోనే మాట్లాడతారు. అందుకు వారు గర్వపడతారు. కానీ అది ఏమి దౌర్భాగ్యం, ఎక్కడినుండి వచ్చిన దరిద్రమో గానీ మనం మాత్రం ఆంగ్ల భాష లో మాట్లాడడానికి ప్రాధాన్యత ఇస్తాం. అమ్మ, నాన్న, అత్త, మామ, అన్నయ్య, అక్క, తాత, మామ్మ, వంటి పదాలు పలకడానికి సిగ్గు పడుతున్నాం. కొన్నాళ్ళకు ఆపదాలు అంతరించిపోయే విధంగా మనం ప్రవర్తిస్తున్నాం. ఇకనుంచి అయినా తెలుగు భాష పై స్వాభిమానం పెంచుకుందాం. తెలుగు లో మాట్లాడుదాం. ఆంగ్లభాష బతుకుతెరువు కోసం నేర్చుకోవాలి. అందుకోసం మన తెలుగు భాష ను బలిచేయనవసరం లేదు.

తెలుగు వాడిగా పుట్టడం గర్వంగా అనుభూతి పొందుదాం.. ❑



# పరమార్థ కథలు




**శ్రీశ్రీశ్రీ విద్యాప్రకాశనందగిరి స్వాముల వారు**

## జ్ఞానోదయము

**పూ**ర్వకాలమున ఒకానొక పట్టణమున ఒక ధనికుడుండెడివాడు. అతడు వ్యాపారముద్వారా లక్షలకొలది ఆస్తిని సంపాదించెను. ఒకనాడతని కొక సంకల్పము జనించెను. అది యేదనగా ఈ ప్రపంచ మున ఎందఱో చక్కని గృహములను సౌధములను నిర్మించుకొని కాపుర ముండుచున్నారు. నాకు పరమాత్మ కోట్లకొలది ధనమును ప్రసాదించినాడు. అట్టిచో ఈ చిన్న గృహమునందే నాజీవితమును గడపనేల? బ్రహ్మాండమైన ప్రాసాదమును, రాజభవనమును ఏల నిర్మించుకొని కాపుర ముండరాదు? కావున ఎన్ని లక్షలద్రవ్యము నైనను ఖర్చుపెట్టి ఇంతవఱకు కని విని యెఱుగనట్టి, అపూర్వభవనమును నిర్మించుకొని అందు నివసించెదను అని ఈ ప్రకారముగ ఆ ధనికుడు గొప్పగొప్ప మేస్త్రీలను వేలకొలది కార్మికులను నియోగించి రెండు సంవత్సరములలో రమణీయమగు హర్మ్య మొకదానిని నిర్మింపజేసెను.

ఆ ప్రసాదము అత్యంత మనోహరముగ నున్నదై రాజభవనములను గూడ మఱిపింప జేయుచుండెను. పది అంతస్తులు గల బ్రహ్మాండమైన సౌధమది, ప్రతి అంతస్తునందును నవీనపద్ధతులతో ఏర్పాటు చేయబడిన చిత్ర విచిత్ర పరికరము లెన్నియో అమర్చబడి కనుల పండువుగా నుండెను. ముఖ్యముగా అన్నిటికంటె పైనున్న అంతస్తు ప్రత్యేక అలంకారములతో గూడినదై, స్నానపానాది సమస్త సౌకర్యములతో గూడి, చూచుటకు ముచ్చట గొలుపుచుండెను. ధనికుడు క్రింద నున్న తొమ్మిది అంతస్తులను అద్దెకిచ్చి తాను మాత్రము కుటుంబముతో సహా పదవ అంతస్తునందు కాపురముండుచుండెను. కనుకనే అద్దానిని ఎంతయో మనోహరముగ తీర్చిదిద్దెను. ఆ భవనము, అందును ముఖ్యముగ ధనికుడు స్వయముగ వసించు పదవ అంతస్తు చూపరులకు దిగ్భ్రమయు గొలుపుచు మయుని సృష్టిని జ్ఞాపకము నకు దెచ్చుచుండెను.

ధనికుడు తాను నిర్మించిన గృహమును జూచి మురిసి పోవు చుండెను. ఆ పట్టణమునకు పెద్దలెవరు విచ్చేసినను, వారిని తన గృహమునకు తీసికొనివచ్చి అంతయు చూపించి పంపుచుండెను. ఒక విజిటర్స్ బుక్ (ఎఱంఱశీతీం దీశీశీఏ) ఏర్పాటుచేసి తన భవనమును గూర్చి ఇతరులచే వారి అభిప్రాయములను అందు లిఖింపజేయుచుండెను. ప్రతివారును తామిట్టి సర్వాంగ సుందరభవనము నింతవఱ కెచటను కని విని యుండలేదనియు, ఇది లోకోత్తర సుందర భవనమనియు అందువ్రాసి వెళ్ళుచుండిరి. వారి యాఅభిప్రాయములను తిలకించి ధనికుడు పరమానంద భరితు డగుచుండెను.

ఇట్లుండ ఒకనా డాపట్టణమున కొక సాధువు విచ్చేసెను, ధనికుడు ఆ సాధువుగారిని తన యింటికి ఆహ్వానించి భిక్ష ఏర్పాటు చేసి, భోజనానంతరము తన గృహమంతయు ఆతనికి చూపెను. క్రిందనున్న తొమ్మిది అంతస్తులను ముందుగా చూపి తుదకు తాను స్వయముగ నివసించుచున్న పదవఅంతస్తునకు సాధువుగారిని తీసికొని వెళ్లి అచటగల ప్రతివస్తువును వివరించి చెప్పుచు అంతయు చూపెట్టెను. సాధువుగారు అచటచట గల ఆధునిక సౌకర్యములను, మిరిమిట్లు గొలుపు చిత్రవిచిత్ర వస్తుసామాగ్రిని, అలంకారములను జూచి పరమాశ్చర్యము నొందెను. ఈ ప్రకారముగ అంతయు చూపించిన పిదప ధనికుడు మహాత్మా! ఈ గృహమును గూర్చి మీయభిప్రాయమును తెలియజేయుడని కోరగా, అంతట సాధువుగారిట్లు వచించిరి.'ఓయీ! ఇట్టి దివ్యభవనమును నేనింతవఱకెచటను చూచి యుండలేదు. ఇది అపూర్వముగ నున్నదై చూపరులకు మహెూల్లాసమును గలుగజేయుచున్నదనుటలో ఏలాంటి సందియమును లేదు. అయితే ఒక్క విషయమున మాత్రము నాకు చాలదిగులు కలుగుచున్నది. ఈ మిద్దెపై మీరు చనిపోయినపుడు మిమ్ములను దింపుట కష్టము. మీ శవమును పదిఅంతస్తులనుండి దింపవలెనన్న చాల కష్టము!'

ఆ వాక్యములను వినగనే ధనికుని గుండె బ్రద్దలయ్యెను. భవిష్యత్తులో తనకు మృత్యువు సంభవించుననిగాని, అపుడు తనకును తన భవనమునకును ఎడబాటు కలుగునని అతడు కలలోనైన ఊహించలేదు. తాను, తన భవనము శాశ్వతమని తలంచి దానిని గాంచి మైమరచి పోవుచుండెను. అట్టి సమయమున సాధువుగారు ధనికునకు కనువిప్పు కలిగించెను. భవిష్యత్తులో జరుగబోవు ఒక మహా ప్రమాదము నాతనికి గుర్తునకు వచ్చెను. అదియే మృత్యువు. దానిని మఱచి జనులు భోగవిలాసములలో మునిగి, ప్రాపంచిక వ్యవహారము లలో నిమగ్నులై, నామరూప జగత్తు సత్యమని నమ్మి విషయముల వెంట పరుగిడుచు తమ సౌందర్యము, తమకీర్తి తమ అధికారము తమ ప్రతిష్ఠ, తమ గృహారామాదులు చూచి మురిసిపోవుచున్నారు సాధువు వచించిన వాక్యముద్వారా ధనవంతునకు ప్రపంచవస్తు స్వరూపము దృగ్గోచర మయ్యెను. బాహ్యవస్తువుల క్షణికత్వము అనుభూత మయ్యెను. ఆతనికి జ్ఞానోదయము కలిగెను. అప్పటి నుండియు అతడు తన భవనముపై గాని, ఇతర వస్తువుల పైగాని మమత్వ ముంచక, అట్టి క్షణిక వస్తుజాలముపై విరక్తి గలిగి శాశ్వతమగు పరమాత్మనే ఆశ్రయిం.

జనులు తమ సంపదలను, వైభవములను జూచి విఱ్ఱవీగరాదు.

'మా కురు ధన జన యౌవనగర్వం

హరతి నిమేషాత్కాలస్సర్వం'

అను శంకర భగవత్పాదుల వాక్యానుసారము అవి యన్నియు కాలగర్భమున అంతరించిపోవును. గోవిందు డొకడే శాశ్వతుడు. కావున ఆ పరమాత్మనే భజించవలెను (భజగోవిందం), ఆతనినే ఆశ్రయించ వలెను. బాహ్యవస్తువులన్నియు, తుదకు దేహముకూడ కాలక్రమమున నశించిపోవునను పరమసత్యమును ఏ కాలమందును మఱువరాదు, ఈ ప్రకార మెఱింగి, వ్యవహార మాచరించుచున్నప్పటికి దేనియందును తగుల్కొనక, భగవంతుని ఆశ్రయించి కాలము గడుపువాడు ధన్యుడు, అట్టివాడు బాహ్యవస్తువులపై మమత్వ ముంచక తన హృదయస్థ పరమాత్మను ఈ జీవితమందే సాక్షాత్కరించుకొని కృతార్థుడు కాగలడు. అట్టి ఆత్మసాక్షాత్కారమే జీవితపరమార్థమని సర్వులు గుర్తెరిగి అద్దానిని యత్నపూర్వకముగ బడసి ధన్యులు కావలయును.

నీతి:- ప్రాపంచిక వైభవములు అశాశ్వతములు. వానిని చూచి మురిసిపోరాదు. తాను చేసిన పుణ్యమే, తాను పొందిన ఆత్మజ్ఞానమే తన్ను రక్షించును. ❑



# కన్నదాసన్ గారు చెప్పిన అక్షర సత్యాలు

**త**మిళభాషలో కవిరాజుగా ప్రసిద్ధి చెందిన కన్నదాసన్ గారు చెప్పిన మాటలు అక్షర సత్యాలు

అర్థవంతమైన హిందూ మతము. నేను హిందువుగా ఉండడానికి ఇష్టపడుటకు కారణాలు

1. భగవంతుడు లేడని చెప్పినా, మత ద్రోహిగా పరిగణించని ధర్మం, హిందూధర్మం.

2. రోజుకు ఇన్ని సార్లు, వారానికి ఇన్ని సార్లు, నెలకు ఇన్ని సార్లు తప్పనిసరిగా గుడికి వెళ్ళి తీరాలనే నిబంధనలు పెట్టని ధర్మంలి , లిహిందూధర్మం.

3. జీవిత కాలంలో కాశికో లేక రామేశ్వరానికో తప్పని సరిగా ఒక్కసారి వెళ్ళే తీరాలనే నిబంధనలు పెట్టని ధర్మం,లి లిహిందూధర్మం.

4. హిందూ మత గ్రంథాల ప్రకారమే జీవనాన్ని కొనసాగించాలనే నిబంధనలు పెట్టని ధర్మం, హిందూధర్మం.

5. హిందూ మతానికి ప్రత్యేకమైన మతపెద్ద అంటూ ఎవరూ ఉండరు.

6. సన్యాసులు, స్వామీజీలు, మఠాధిపతులు తప్పులు చేసినా, నిలదీసి, ప్రశ్నించే ధర్మం, హిందూధర్మం.

7. హిందువులు ఈ క్రింది వాటిని కూడా భగవత్స్వరూపాలుగానే ఆరాధిస్తారు.

వృక్షాలు దైవ స్వరూపాలే.

రాళ్ళూ - రప్పలూ కూడా దైవస్వరూపాలే.

నీరు (గంగ) కూడా దైవ సవరూపమే.

గాలి కూడా దైవ స్వరూపమే.

వానరాలు (కోతులు) కూడా దైవ స్వరూపాలే.

కుక్కలు (భైరవుడు) కూడా దైవ స్వరూపాలే.

పందులు (వరాహం) కూడా దైవ స్వరూపాలే.

8. నువ్వూ దైవ స్వరూపమే.

నేనూ దైవ స్వరూపమే.

చక్షు గోచరమైనవన్నీ

(కంటికి కనిపించేవన్నీ)

దైవ స్వరూపాలే.

9. చతుర్వేదాలు, నాలుగు ఉపవేదాలు, రెండు ఇతిహాసాలు, పద్దెనిమిది పురాణాలు, పద్దెనిమిది ఉపపురాణాలు, ఆరు శాస్త్రాలు, పద్దెనిమిది స్మృతులతో పాటు 1200 వందలకు పైగా ధార్మిక గ్రంథాలు గల సువిశాల ధర్మం, హిందూధర్మం.

10. మన ధార్మిక గ్రంథాలు మనకు బోధించే విశిష్ట ధర్మాలు.

కర్మల గురించి తెలియాలంటే

వేదాలు చదవాలి.

సమస్త జ్ఞానం పొందాలంటే ..

ఉపనిషత్తులు చదవాలి

పర స్త్రీ వ్యామోహం పోవాలంటే ......

రామాయణం చదవాలి.

రాజ్యకాంక్ష, పదవీ వ్యామోహం పోవాలంటే ......

మహాభారతం చదవాలి.

భగవంతుని తత్త్వం తెలియాలంటే ......

భాగవతం చదవాలి.

చక్కటి పరిపాలన అందించాలంటే .....

కౌటిల్యుని "అర్థశాస్త్రం" చదవాలి.

అన్యోన్య దాంపత్యానికి ......

వాత్స్యాయన కామశాస్త్రం చదవాలి.

చక్కటి ఆరోగ్యానికి ......

ఆయుర్వేదం చదవాలి.

మేధస్సుకు .....

వేద గణితం చదవాలి.

శారీరక ఆరోగ్యానికి మరియు శారీరక సౌష్ఠవానికి

పతంజలి యోగశాస్త్రం చదవాలి.

భవన నిర్మాణాలకు .....

వాస్తుశాస్త్రం చదవాలి.

గ్రహ, నక్షత్రాలను గురించి తెలుసుకోవడానికి

ఖగోళ శాస్త్రాన్ని చదవాలి

11. ఎవ్వరినీ బలవంతంగా మతం మార్పించే ప్రయత్నం చేయని ధర్మం, హిందూధర్మం.

12. ఆహార అలవాట్లలో కూడా ఎవరి ఇష్టం వచ్చినట్లు వారు ఉండవచ్చు. (ప్రపంచంలో శాఖాహారం, మాంసాహారం ఈ రెంటిలో ఎవరికి నచ్చిన ఆహార పద్ధతులను వారు పాటించవచ్చు)

13. హిందూధర్మం, అన్ని మతాలను, అన్ని ధర్మాలను సమానంగానే పరిగణిస్తుంది.

14. మోక్షానికి దారి చూపించే ధర్మం, హిందూధర్మం


15. అన్ని మతాలను గౌరవించే ధర్మం, హిందూధర్మం.

16. పరమత దూషణ చెయ్యని ధర్మం, హిందూధర్మం

హిందువుగా జన్మించాం.

హిందువుగా జీవిద్దాం.

హిందువుగా మరణిద్దాం.



# ఓ ఐదు రూపాయలు

"నాన్నగారికి మందులు తీసుకురావాలి..ఓ ఐదు ఐదు రూపాయలు రూపాయలు ఉంటే సర్దుతారా..?" తన్నుకొస్తున్న దుఃఖాన్ని దిగమింగుకుంటూ అడిగాడు ఆయన !

ఈ మాటలు అన్నది సాదా సీదా వ్యక్తి అయితే పెద్దగా ఆశర్యం ఉండేది కాదేమో !

కానీ ఐదు రూపాయలు చేబదులు అడిగిన వ్యక్తి టంగుటూరి ప్రకాశం గారి రెండో కుమారుడు హనుమంతరావు గారు ! అప్పు అడిగింది తుర్లపాటి కుటుంబరావు గారిని !

సాక్షాత్తు ఒక రాష్ట్రాన్ని పరిపాలించిన మాజీ ముఖ్యమంత్రి కొడుకు నోటినుంచి కన్నీటితో వచ్చిన మాటలు విన్న తరువాత ఎవరికైనా కంట తడి రాక మానదు !

ఆంధ్ర రాష్ట్రాన్ని పరిపాలించిన టంగుటూరి ప్రకాశం పంతులు గారి చివరి రోజుల్లో ఆర్థిక భారంతో ఆయన పడిన ఇబ్బందులకు ప్రత్యక్ష సాక్షి ఈ ఐదు రూపాయలు !

చెన్నై లో క్షణం తీరికలేని పనులు ముగించుకుని నివాసానికి చేరుకున్న టంగుటూరి ప్రకాశం గారికి కొద్దిగా అస్వస్థత గా ఉందని తెలిసి ఆయనకు వ్యక్తిగత కార్యదర్శిగా పనిచేస్తున్న తుర్లపాటి కుటుంబరావు గారు వారి నివాసానికి చేరుకున్నారు !

లోపలి నుంచి బయటకు వచ్చిన టంగుటూరి కుమారుడు తుర్లపాటి కుటుంబరావు గారి దగ్గరకు వచ్చి గద్గద స్వరంతో " నాన్న గారికి మందులు తీసుకురావాలి..ఓ ఐదు రూపాయలు సర్దుతారా.." అనంతంతో షాక్ తో తుర్లపాటి కుటుంబరావు గారి నోటెంబట క్షణ కాలం మాట రాలేదు !

వెంటనే తేరుకుని ఉబికి వస్తున్న కన్నీటిని అతి ప్రయత్నం మీద ఆపుకుంటూ జేబులోనుంచి ఐదు రూపాయిలు తీసి ఆయన చేతిలో పెట్టాడు !

ఈ చేదు నిజాల్ని తుర్లపాటి కుటుంబరావు గారు స్వయంగా తన పుస్తకంలో కళ్ళకు కట్టినట్టు వివరించారు !!

దేశం కోసం తన ఆస్తినంతా ధారపోసి చివరి రోజుల్లో కటిక దారిద్ర్యాన్ని అనుభవించిన టంగుటూరి లాంటి మహోన్నత వ్యక్తులను నేటి భారతంలో ఆశించగలమా ?

ముఖ్యమంత్రి పదవి అంటే తర తరాలకు సరిపడా ఆస్తులను దోచుకుని తమ వారసులకు పంచి పెట్టే ఒక అద్భుత దీపంగా భావించే ప్రస్తుత రోజుల్లో దేశం కోసం సొంత ఆస్తులను అమ్ముకుని రూపాయికి లేని అటువంటి ముఖ్యమంత్రిని చూడగలమా ?

అంటే చూడలేమనే సమాధానం వస్తుంది !

ఆ తరం వేరు నేటి తరం వేరు !

ఆనాటి రాజకీయాలు వేరు ఈనాటి అరాచకీయాలు వేరు !

డియర్ రాజకీయ నాయకులూ / పాలకులూ మీ మీ ఓటు బ్యాంకు రాజకీయాలు ఎలా ఉన్నా సంవత్సరంలో ఒకసారైనా ఇటువంటి మహనీయుడి పేరున మంచి కార్యక్రమాలు చేపట్టండి !

దేశం కోసం నిస్వార్థంగా సేవ చేయగలిగారు కాబట్టే టంగుటూరి నేటికీ ప్రజల గుండెల్లో చిరస్మరనీయుడు అయ్యారు మహానుభావుడికి నివాళులు !

❑

## భరోసా

ఒక పిరికివాడు ఓ స్మశానం దాటాల్సి వచ్చింది. ఎవరన్నా వచ్చేవరకు కొంచెంసేపు ఆగి కొంచెం దూరంలో ఎవరో వస్తుంటే అతనితో కలిసి ధైర్యంగా స్మశానం దాటేసాడు.. ఇంతకీ ఆ రెండో వ్యక్తి కూడా వీడికన్నా పిరికివాడట! కాని కేవలం వాడికి వీడు, వీడికి వాడు తోడు ఉన్నారు అనే ఒకే ఒక్క భరోసా వాళ్ళని స్మశానం దాటేలా చేసింది.

నిజ జీవితంలో కూడా మనిషికి కావాల్సింది అలాంటి భరోసానే.. నేను ఉన్నాను అనే భరోసా ఒక మాట సాయం...ఏమి కాదు నేను ఉన్నా అనే చిన్న మాట చెప్పి చూడు..మనిషికి ఎంత బలం వస్తుందో...ఆ బలంతో ఆ మనిషి ఏదైనా చేయగలడు.

ఓ సారి ఒకాయన తన కారులో ఓ గ్రామానికెళ్తుంటే, కారు దారిలో ఓ బురదగుంటలో దిగబడిపోయింది. సాయంకోసం చుట్టూచూస్తే ఓరైతు కనపడ్డాడు. పరిస్థితిచూసిన రైతు, "ఉండండి, నా ఎద్దుతో కారును బైటికి లాగుదాం" అని దగ్గరలోని తన పొలంనుంచి తన ముసలి ఎద్దును తోలుకొచ్చాడు. దాన్నిచూస్తూనే ఆ పెద్దమనిషి నిరాశతో ఉసూరుమన్నాడు!

రైతు ఎద్దుని కారు ముందు తాడుతో కట్టి, "ఒరేయ్ రాజూ, అంజీ, నందీ! ఎంటిరా ఆలోచిస్తున్నరూ, తిన్నదంతా ఏమైంది, బండిని లాగండిరా" అని ఉత్సాహంగా అదిలించాడు. అంతే! రాజు ఆ కారుని ఒక్క ఊపుతో బైటికి లాగేసింది.

పెద్దాయన ఆశ్చర్యంతో, " సర్, ఉన్నది ఒక ఎద్దేకదా, మీరేంటీ, అన్ని ఎద్దు ఉన్నట్టు అదిలించారు?"

రైతు, "ఈ రాజు బక్కదే కాదండి, గుడ్డిది కూడా! ఐతే, తనుకాక ఇంకా చాలా ఎద్లున్నాయనే ధైర్యంతో తన బలాన్నంతా పెట్టింది, అంతే! పూర్తి నమ్మకంతో చేస్తే, ఎంత కష్టమైన పనైనా తేలిగ్గా చేయచ్చు!"

రైతు తెలివికీ, సమయస్ఫూర్తికీ ఆ నగరవాసి తలమునకలయ్యాడు!

పూర్వం 10 మంది పిల్లల్ని కని కూడా ఎంతో ధైర్యంతో పెంచి పోషించే వారంటే, అలాంటి ధైర్యమే కారణం..ఉమ్మడి కుటుంబాలలో 'మేము ఉన్నాం' అనే భరోసా కారణం.

కాని ఈ రోజుల్లో ఒక్క పిల్లో పిల్లోడో చాలురా దేవుడా అనుకోవటానికి కారణం మేము ఉన్నాం చూస్కోటానికి అని భరోసా ఇచ్చే మనుషులు, బంధువులు మన చుట్టూ లేక పోవటం...

కష్టంలో మనిషికి నేనున్నా అనే భరోసా ఇవ్వండి అది కుదరక పోతే కనీసం ఒక మాట సాయం చేయండి..ఎందుకంటే మనిషికి మనిషే భరోసా కాబట్టి.. మనలో ఒకరికి ఒకరు ఐక్యత ముఖ్యం.

ప్రతి ఒక్కరి కథ కంచికి చేరుతుంది. ఆలోపునే మనం మనుషులుగా ఎదగాలి...

❑



## జీవీ రాక్ పేజీ

ప్రతిపనీ సాఫల్యమవడానికి ముందు వందలాది
అవరోధాలను అధిగమించాల్సి ఉంటుంది.
ఎవరు పట్టుదలతో ప్రయత్నిస్తారో అలాంటివారు
ఆలస్యంగానైనా విజయాన్ని సాధిస్తారు.
– స్వామి వివేకానంద



### నాన్న

మీరెప్పుడు మాతోనే మాలోనే .
మీ జ్ఞాపకాలు చెరిగి పోనివి. చెదిరి పోనివి.

**తత్కర్మ నియతం కుర్యాత్**
**యేన తుష్టో భవేత్ పితా।**
**తన్నకుర్యాత్ యేన పితా**
**మనాగపి విసీదతి॥**

ఏ పని చేస్తే తండ్రి సంతుష్టుడగునో, ఆ పనిని పుత్రుడు తప్పక చేయవలెను..... తండ్రికి ఏ కొంచెము దుఃఖము కలిగించునదైనను, ఆ పని పుత్రుడు చేయరాదు. గత సంవత్సరం ప్రముఖాంధ్రను విశ్వ ప్రయత్నం చేసినా తీసుకు రాలేక పోయాను. ఈ పత్రికంటే ఆయనకు ప్రాణం. ఆయన నడిపిన పత్రికలలో ఇన్నేళ్లు నిరాటంకంగా వచ్చిన పత్రిక ప్రముఖాంధ్ర. మిగిలిన పత్రికలన్నీ వ్యాపార ధోరణితో తీసుకు వచ్చినవి, ప్రముఖాంధ్ర పత్రిక మాత్రం తెలుగువారి కోసం భాష సంస్కృతి సంప్రదాయాలను, తెలుగు వారిలో గొప్పవారిని నలుగురికి పరిచయం చేస్తూ ప్రపంచమంతా చాటింపు వేసిన పత్రిక. ఈ పత్రికను తిరిగి తీసుకు రావాలని అనుకుని ఇందిరా దత్ మేడం గారిని సంప్రదించిన తోడనే, నా అభ్యర్థనను అంగీకరించి వెంటనే స్పందించారు. వారికి నా కృతజ్ఞతలు. ఎప్పుడు నన్ను ప్రోత్సహించే గోపురం హరికృష్ణ గారు, అజంతా శంకరరావు గార్ల సహకారం మరువలేను. మూడు నెలలు పత్రిక వచ్చాకే అందరిని పలకరించాలనుకున్నాను. ఇక ప్రతి నెల ఈ చివరి పేజీలో మిమ్మల్ని పలకరిస్తూ వుంటాను. ఈ మార్చ్ 7 మా పెద్దాయన పుట్టినరోజు, మళ్ళీ ప్రముఖాంధ్ర తీసుకొచ్చాననే సంతోషంతో ఆయన ముందు కాసేపు నిలబడి మాట్లాడుకున్నా, ఇది నాకు ఆయనకు అలవాటే! అదే నాకు తృప్తి , ఆనందం.

మీ, గోటేటి వెంకటేశ్వర రావు

# దేహం తండ్రి ప్రసాదం

దేహం తండ్రి ప్రసాదం' అని వేదం స్పష్టంగా చెప్పింది.

తండ్రి మాటను నిలబెట్టడం కోసం రాముడు చేసిన అపూర్వ త్యాగాన్ని రామాయణం విస్తారంగా చర్చించింది.

తండ్రి యయాతికి తన యౌవనాన్నే ధారపోసిన పూరుడి కథను భాగవతం వర్ణించి చెప్పింది.

తండ్రి కోసం భీషణ ప్రతిజ్ఞ చేసి చివరికంటా బ్రహ్మచర్యం పాటించిన భీష్మ పితామహుడి గాథను భారతం వివరించింది.

'పుత్ర శబ్దానికి -- తన మంచి పనులతో ప్రీతి కలిగించేవాడు, పితృభక్తి గలవాడు మాత్రమే అర్హుడు' అని మన పెద్దలు నిర్వచించారు.

'భార్య, భర్త అనే రెండు తాళ్లు ముడివేస్తే, ఆ ముడి- సంతానం' అంటాడు భర్తృహరి. దాన్నే ' సుతాకారపు ముడి ' అని చెబుతారు.

అది పేగు బంధం. ఆ బంధం శిథిలమైతే బతుక్కి అర్థం ఉండదు.

వృద్ధులైన తల్లిదండ్రులను కావడిలో స్వయంగా మోస్తూ తీర్థయాత్రలకు తిప్పిన శ్రవణ కుమారుడు,

అనుక్షణం తల్లిదండ్రులను కంటికి రెప్పలా కాచుకున్న ప్రవరాఖ్యుడు,

అమ్మ ఆర్యమాంబకు ఇచ్చిన మాట కోసం సన్యాస దీక్ష నుంచి దిగివచ్చి అమ్మకు అంత్యక్రియలు నిర్వహించిన శంకరులు,

ఇలాంటివారే పుత్ర శబ్దానికి అర్హులు.

అంతేకాని- వృద్ధులైన అమ్మానాన్నలను సేవించడం కంటే, వృద్ధాశ్రమాల్లో పెట్టి పోషించడం సౌకర్యంగా ఉంటుందనుకునేవాళ్లు, పుత్రులు అనిపించుకోరు. అమ్మను ఇంట్లో ఉంచుకుందాం దేనికైనా 'పని'కొస్తుందని, అమ్మానాన్నలను విడదీసేవారికి 'తల్లిదండ్రులు' అనే పదం గురించి బొత్తిగా తెలియదని అర్థం.

ఆ పదం సమాసరీత్యా ద్వంద్వమే కానీ, స్వభావరీత్యా ఏకవచనమే!

కాబట్టే విగ్రహవాక్యం -- 'తల్లియును తండ్రియును' అంటూ ఏకవచనంలో చెప్పాలంది వ్యాకరణ శాస్త్రం . 'వారు ఇద్దరు కారు, ఒక్కరే' అనే భావనను మనలో పెంపొందించడానికే -- భారతీయ తత్వచింతన అర్ధనారీశ్వర తత్వాన్ని ప్రతిపాదించింది.

కుటుంబ వ్యవస్థకు, గృహస్థధర్మ నిర్వహణకు ఆధారపీఠాలుగా నిలిచిన నాలుగు మూల స్తంభాల్లో ' మాతృదేవోభవ' 'పితృదేవోభవ 'లను మొదటి రెండుగా చెబుతారు. వీటిలో అమ్మకు- పెరట్లో తులసి మొక్క గూట్లో కాంతులీనే ప్రమిద దీపం ప్రతీక! ఇంటి వాకిటా వికాసాన్ని వెదజల్లే వీధిగడప దీపం నాన్నకు ప్రతీక! "లోకంలో అమ్మలపై వచ్చినంత కవిత్వం నాన్నల గురించి రాకపోవడంలో విచిత్రం ఏమీ లేదు."


అమ్మ ప్రేమ పారదర్శకం, నాన్న ప్రేమ గుంభనం కావడమే దానికి కారణం. అమ్మది ఆప్తవాక్యం, నాన్నది గుప్తధనం!

అమ్మ ప్రేమలో వైశాల్యం ఎక్కువ. నాన్న ప్రేమకు లోతెక్కువ.

ఆత్మీయత, వాత్సల్యం వంటి విషయాల్లో ఇద్దరి స్వభావాలూ ఒక్కటే అయినా- నాన్న అంత తొందరగా బయటపడడు కాబట్టి, అమ్మతో ఉన్నంత చనువు నాన్నతో లేకపోవడం లోక సహజం!

అమ్మ జన్మదాత, నాన్న జీవనదాత. పిల్లలకు రక్షణ, పోషణ విషయంలో నాన్నే ఆలంబన.

శ్రమ విషయంలో కొడుకు తనకన్నా తక్కువ కష్టాలతో గట్టెక్కాలని, స్థాయి విషయంలో తనకన్నా చాలా ఎత్తుగా ఉండాలని తపన పడని తండ్రి ఉండడు. దానికోసం ఎలాంటి త్యాగానికైనా సిద్ధపడటం నాన్న లక్షణం !! ❑


గోపురం
పసుపు పొడి
మరియు కుంకుమ
TRADE MARK
GOPURAM
KUMKUM
Y.V.S. & CO., MADRAS.
Turmeric POWDER
GOPURAM
FOR POOJA AND
RELIGIOUS FUNCTIONS
VISIT US AT
Website : www.gopuramproducts.com
Email : yvs@gopuramproducts.com

Date of Publication - 3rd of every month
PRAMUKHANDHRA
Registered with Registrar of Newspapers for India RNI No. 67369/97
March 2026
PERIODICAL POST

